E KABURU - Digital News Paper
E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 14-04-2026 (వారం) మంగళవారం సంపుటి: 02 || సంచిక:102 || పేజీలు–6
www.ekaburu.com

## ఇలాంటి పోప్ నాకొద్దు: ట్రంప్

..నేను మీకు భయపడను: లియో



03



# ఇరాన్ దిగ్బంధనం!

ఓడరేవులు, తీరప్రాంతాలకు వెళ్లే నౌకల్ని అడ్డుకుంటున్న అమెరికా

అందుకోసం భారీగా బలగాల మోహరింపు

తీవ్రంగా స్పందించిన టెహ్రాన్

గల్ఫ్‌లో పోర్టులన్నింటికీ రాకపోకల్ని నిరోధిస్తామని హెచ్చరిక

నివురుగప్పిన నిప్పులా పశ్చిమాసియా

ఇరాన్ మాట నిలబెట్టుకోలేదు

దాని నౌకలను పేల్చేయండి

అమెరికా బలగాలకు ట్రంప్ ఆదేశం

పెరుగుతున్న చమురు ధరలు!

**ఈ-కబురు, కైరో:**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నంత పనీ చేశారు! ఇరాన్ ఓడరేవులు, తీర ప్రాంతాలను తమ నౌకాదళంతో దిగ్బంధించారు! ఆ దేశానికి నౌకల రాకపోకలను అడ్డుకునే ప్రక్రియను సోమవారం మొదలుపెట్టారు. దీంతో 15 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. అంతర్జాతీయ విపణిలో ఇప్పటికే భగ్గుమంటున్న చమురు ధరలు మరింత పెరిగే ముప్పు పెరిగింది. అమెరికా చర్యపై తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్న ఇరాన్.. దీటుగా బదులిచ్చేందుకు సిద్ధమవుతోంది. తమ రేవుల దిగ్బంధనానికి ప్రతిగా పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌ల చుట్టూ ఉన్న పోర్టులన్నింటికీ రాకపోకల్ని అడ్డుకుంటామని అది హెచ్చరించింది. పశ్చిమాసియాలో ఏ ఓడరేవూ సురక్షితం కాదంటూ తీవ్ర వ్యాఖ్య చేసింది. మరోవైపు పాకిస్థాన్‌లో శాంతి చర్చలు విఫలమైన నేపథ్యంలో ఇరాన్‌పై మళ్లీ దాడులు చేసేందుకు అమెరికా, ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో పశ్చిమాసియా నివురుగప్పిన నిప్పులా తయారైంది. ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న ఆందోళన సర్వత్రా నెలకొంది.

ఇరానేతర దేశాల రేవులకు వెళ్తే మినహాయింపు

పాక్‌లో శాంతి చర్చలు విఫలమవడంతో.. ఇరాన్ ఓడరేవులు, తీర ప్రాంతాలను దిగ్బంధించాలని తమ నౌకాదళాన్ని ట్రంప్ ఆదేశించారు. దీంతో దిగ్బంధన ప్రక్రియను అమెరికా సెంట్రల్ కమాండ్ సోమవారం రాత్రి ప్రారంభించింది. హర్మూజ్ సమీపంలో బలగాలను భారీగా మోహరించింది. ఇరాన్‌కు వచ్చే, ఆ దేశాన్ని వీడే నౌకలన్నింటినీ అడ్డుకుంటామని సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లలోని ఇరాన్ ఓడరేవులకూ రాకపోకలను సాగనివ్వబోమని స్పష్టం చేసింది. ఇరానేతర దేశాల పోర్టులకు వెళ్లే నౌకల ప్రయాణానికి మాత్రం హర్మూజ్ వద్ద అడ్డు తగలబోమని తెలిపింది. హర్మూజ్‌లో రాకపోకలను పూర్తిగా నిరోధిస్తామంటూ ట్రంప్ తొలుత (ఆదివారం) ప్రకటించిన సంగతి గమనార్హం. దిగ్బంధన ప్రక్రియ కోసం ఇరాన్ పోర్టులు, తీరప్రాంతాల చుట్టూ 15కుపైగా యుద్ధనౌకలను అమెరికా మోహరించింది. ఇందులో యూఎస్‌ఎస్ ట్రిపోలి (ఎల్‌హెచ్‌ఏ 7) కూడా ఉంది. ఈ యుద్ధనౌకపై ఎఫ్35బి లైటెనింగ్ 2 స్టెల్త్‌ఫైటర్లు, ఎంవీ22 ఆస్‌ప్రేస్, హెలికాప్టర్ల వంటివి అందుబాటులో ఉంటాయి.

**ఒత్తిడి పెంచేందుకే..**

యుద్ధం ఆరంభమైనప్పటి నుంచీ ఇరాన్ కొన్ని కోట్ల బ్యారళ్ల చమురును ఎగుమతి చేసింది. అందులో అధిక భాగం.. తనపై ఆంక్షలు విధించిన పాశ్చాత్య దేశాల కళ్లుగప్పి తరలించినదే! ప్రస్తుతం అమెరికా దిగ్బంధనానికి దిగడంతో.. ఎగుమతులు నిలిచిపోయి ఇరాన్ ఒత్తిడికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆర్థికంగా దానికి భారీ నష్టం వాటిల్లనుంది. అలా జరిగితే.. టెహ్రాన్ తమతో శాంతి ఒప్పందానికి వస్తుందన్నది ట్రంప్ యోచన. అయితే ఈ దిగ్బంధనంతో అంతర్జాతీయంగానూ చమురు ధరలు మరింత పెరిగే ముప్పుంది. దీనివల్ల ట్రంప్‌పైనా ఒత్తిడి పెరగొచ్చు. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర సోమవారం ఒక్కరోజే 7% పెరిగింది. ఇరాన్ బలగాలు దాడులకు దిగితే.. దిగ్బంధనాన్ని కొనసాగించడం అమెరికా బలగాలకు అంత సులభం కాదు.

మిగతా 2లో

## హైబ్రిడ్ నమూనాలో
# సీట్ల పునర్విభజన

50 శాతం జనాభా.. 50 శాతం రాష్ట్రాల ఆర్థికవృద్ధి ప్రాతిపదికన పెంచండి

దామాషా పద్ధతిలో 50 శాతం సీట్లు పెంచితే దక్షిణాదికి తీవ్ర నష్టం

లోక్‌సభ సీట్ల పెంపుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టీకరణ



ఈకబురు, హైదరాబాద్: ''విద్య, ఉద్యోగ అవకాశాల్లో కూడా 50 శాతానికి మించకుండా రిజర్వేషన్లు అమలు చేయాలని, మిగిలిన 50 శాతం మెరిట్‌తో చేయాలని సుప్రీంకోర్టే చెప్పింది. అందుకే సీట్ల పునర్విభజనపై హైబ్రిడ్ నమూనాను ప్రతిపాదిస్తున్నాం. పెంచాలనుకుంటున్న 272 లోక్‌సభ సీట్లలో 50 శాతం అంటే..136 ప్రొరేటా (జనాభా ప్రాతిపదికన) ప్రకారం.. మిగిలిన 50శాతం(136 సీట్లు) రాష్ట్రాల స్థూల ఆర్థికవృద్ధి రేటు ఆధారంగా పునర్విభజన చేయండి. దేశ జీఎస్‌డీపీలో అత్యధిక భాగస్వామ్యం అందిస్తున్న రాష్ట్రాలకు మెరిట్ ప్రాతిపదికన అవకాశమివ్వాలి''అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. సచివాలయంలో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ''దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఆదాయాన్ని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి. అలాంటి మమ్మల్ని ఎలా శిక్షిస్తారు? దామాషా పద్ధతిలో 50 శాతం సీట్లు పెంచితే దక్షిణాదికి తీవ్ర నష్టం. దక్షిణాది ప్రమేయం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవచ్చు. ఇది రాజకీయ సమస్య కాదు. పూర్తిగా ప్రజలది. ఇప్పుడు ప్రధాని మోదీ ఈ సమస్యను అత్యంత ప్రమాదకరంగా వాడుకుంటున్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు కాంగ్రెస్ పార్టీ 100 శాతం కట్టుబడి ఉంది. ప్రస్తుతమున్న సీట్ల ప్రాతిపదికగా.. 33 శాతం మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలుచేయాలి.

మిగతా 2లో



6

## కొత్త కుర్రాళ్లు కేక పుట్టించారు

అదరగొట్టిన ప్రఫుల్, సకిబ్

ఇషాన్ కెప్టెన్ ఇన్నింగ్స్

రాజస్థాన్‌పై హైదరాబాద్ ఘనవిజయం

.1/0.. 2/1.. 3/1.. 4/2.. 5/9.. రాజస్థాన్ రాయల్స్ పతనం సాగిన తీరిది. ఈ గణాంకాల్ని బట్టి చెప్పేయొచ్చు.. ఆ జట్టు ఎంతగా ఉక్కిరిబిక్కిరి అయిందో! ఈ ఐపీఎల్‌లో వరుసగా నాలుగు విజయాలతో జైత్రయాత్ర.. పాయింట్ల పట్టికలో అగ్రస్థానం.. దుర్భేద్యమైన బ్యాటింగ్‌తో ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచిన రాజస్థాన్‌ను కొత్త కుర్రాళ్లు నేలకు దించేశారు. పేలవ బౌలింగ్‌తో సతమతమవుతున్న సన్‌రైజర్స్‌కు గొప్ప ఉపశమనాన్ని ఇస్తూ విదర్భ ఎక్స్‌ప్రెస్ ప్రఫుల్ హింగే (4/34)..

## మమతకు టాటా బైబై: అమిత్ షా


దశాబ్దాల నిరీక్షణకు 16, 17, 18 తేదీల్లో తెర

వెంటనే అమలు పరచాలని ప్రతిపక్షాలు డిమాండు చేశాయి

వారి అభిప్రాయాలను స్వీకరించి మేధోమథనం చేశాం

సరికొత్త చరిత్రకు పార్లమెంటు సిద్ధం

నారీ శక్తి వందన్ సమ్మేళనంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు



మిగతా 2లో



3

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై రాజకీయం వద్దు

సీఎం రేవంత్ అవగాహన లోపంతో మాట్లాడుతున్నారు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఈ కబురు, హైదరాబాద్:

మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో రాజకీయం చేయవద్దని... సీఎం రేవంత్‌రెడ్డి అవగాహనా లోపంతో ఈ బిల్లుపై లేనిపోనివి మాట్లాడుతున్నారని

## మహిళా రిజర్వేషన్ చట్టం
# ఈ శతాబ్దపు అతి పెద్ద నిర్ణయం

దశాబ్దాల నిరీక్షణకు 16, 17, 18 తేదీల్లో తెర

వెంటనే అమలు పరచాలని ప్రతిపక్షాలు డిమాండు చేశాయి

వారి అభిప్రాయాలను స్వీకరించి మేధోమథనం చేశాం

సరికొత్త చరిత్రకు పార్లమెంటు సిద్ధం

నారీ శక్తి వందన్ సమ్మేళనంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు



మిగతా 2లో

## భారాస కూల్చిన రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మిస్తున్నాం



'భూభారతి'కి నేటితో ఏడాది

సంవత్సరంలో 3.80 లక్షల మందికి పాసుపుస్తకాలు

రెవెన్యూశాఖ సమీక్షలో మంత్రి పొంగులేటి

ఈకబురు,హైదరాబాద్: భారాస ప్రభుత్వం కూప్పకూల్చిన రెవెన్యూ వ్యవస్థను సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పునర్నిర్మిస్తోందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూ హక్కుల పరిరక్షణ, పారదర్శకతతో కూడిన అవినీతి రహిత సేవలు సామాన్యులకు అందించే లక్ష్యంతో అమల్లోకి వచ్చిన భూభారతి చట్టం రాష్ట్ర చరిత్రలో కీలక సంస్కరణగా నిలుస్తోందన్నారు. భూభారతి చట్టం అమల్లోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సోమవారం అధికారులతో మంత్రి సమీక్షించారు.

మిగతా 2లో



## అంత తొందరేంటి?

ప్రతిపాదిత డీలిమిటేషన్ రాజ్యాంగంపై దాడే: సోనియా

03

ఈ కబురు, దిల్లీ:

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రతిపాదించిన డీలిమిటేషన్ అత్యంత ప్రమాదకరమని, రాజ్యాంగంపై జరుగుతున్న దాడి అని కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ ధ్వజమెత్తారు.

## వలస పోవడానికి నేను అవకాశవాదిని కాదు



02

- నా తుది శ్వాస వరకు భాజపాలోనే
- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్

ఈ కబురు, తెలంగాణచౌక్(కరీంనగర్):

వలస పోవడానికి తాను అవకాశవాదిని కాదని, రేవంత్‌రెడ్డిని అంతకంటే కాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టంచేశారు. బండి సంజయ్ ఏదో ఒక రాష్ట్రానికి వలసపోక తప్పదంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానిం

## భాజపాకు తమిళనాడులో స్థానం ఇవ్వొద్దు



..అక్కడి ఎన్నికల ప్రచారంలో మంత్రి ఉత్తమ్

ఈ కబురు, హైదరాబాద్:

తమిళనాడు లౌకిక స్వరూపంపై దాడి చేయడానికి భాజపాఏఐఏడీఎంకే కూటమిలోని పార్టీలు పోటీపడుతున్నాయని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు.

మిగతా 2లో

## పోరాడి సాధించుకున్నది ఎప్పటికీ గుర్తుండిపోతుంది

03



## మమతకు టాటా బైబై: అమిత్ షా



ఈకబురు,బీర్‌భుమ్: పశ్చిమ బెంగాల్‌లో భాజపా విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, ప్రజలు టీఎంసీ అధినేత మమతా బెనర్జీకి ''టాటా బైబై'' చెప్పాలని నిర్ణయించుకున్నారని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా సోమవారం పునరుద్ఘాటించారు. అనేక అవినీతి కార్యకలాపాలకు పాల్పడి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం రూ 5 వేల కోట్ల మేరకు ప్రజాధనాన్ని కైంకర్యం చేసిందని ఆరోపించారు. బీర్‌భుమ్ జిల్లాలో పలు ర్యాలీలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. పశ్చిమ బెంగాల్ ప్రజలు బాంబులు, బుల్లెట్లకు ఓట్లతో సమాధానం చెబుతారని ఆయన అన్నారు. సిండికేట్లు, కట్ మనీ (కమిషన్) సంస్కృతిని ప్రోత్సహిస్తున్న వారిని తలకిందులుగా వేలాడదీస్తామని ఆయన హెచ్చరించారు. టీఎంసీ అండ కలిగిన నేరగాళ్లు బెంగాల్‌లో చాలా కాలంగా భాజపా కార్యకర్తలను వేధించారని, ఎన్నికల అనంతరం ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక మే 5న భాజపా కార్యకర్తలు తమను వేధించిన వారిని వారి ఇళ్లలోనుంచి బయటకు లాక్కొచ్చి తగిన న్యాయం చేస్తారని ఆయన ఆవేశంగా అన్నారు. ''ఈ నెల 23న పశ్చిమ బెంగాల్‌లో తొలిదశ పోలింగ్ జరగనుంది. ఆరోజు బయటకు రావద్దని నేను టీఎంసీ గూండాలకు సలహా ఇస్తున్నాను. వాళ్లు బయటికి వస్తే మే 4న ఒక్కొక్కరినీ గుర్తించి జైళ్లకు పంపుతాం'' అని అమిత్ షా హెచ్చరిక జారీ చేశారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి రాష్ట్రంలో మెజారిటీ వర్గానికి చెందిన ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికలు ఒక్క బెంగాల్ నుంచే కాక దేశం మొత్తం నుంచి చొరబాటుదారుల్ని బయటికి పంపే ప్రక్రియకు నాంది పలుకుతాయని అభిప్రాయపడ్డారు. ''దీదీ మేమిక్కడ శతాబ్దాలుగా నివసిస్తున్నాం. ఎవరిని బెదిరిస్తున్నారు మీరు?'' అని ఆయన ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ఉద్యోగులకు 45 రోజుల్లోగా ఏడో పే కమిషన్ సిఫార్సులను అమలుపరుస్తామని ఆయన హామీ ఇచ్చారు. మహిళలకు నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు చొప్పున ఇవ్వడంతోపాటు, గర్భిణీలకు రూ.21 వేలు, దివ్యాంగులకు రూ.2 వేలు అందిస్తామని హామీ ఇచ్చారు.

## భాజపాకు తమిళనాడులో స్థానం ఇవ్వొద్దు

ఈ కబురు, హైదరాబాద్: తమిళనాడు లౌకిక స్వరూపంపై దాడి చేయడానికి భాజపాఏఐఏడీఎంకే కూటమిలోని పార్టీలు పోటీపడుతున్నాయని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. సోమవారం తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో భాగంగా కోయంబత్తూరు సమీపంలోని సింగనల్లూరు నియోజకవర్గంలో ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... 'తమిళనాడులో చొచ్చుకు వచ్చేందుకు భాజపా చేస్తున్న ప్రయత్నాలు తిప్పికొట్టాలి. ఆ పార్టీ సాధించే ఏ చిన్న విజయమైనా రాష్ట్ర ప్రగతిశీల స్ఫూర్తిని దెబ్బతీస్తుంది. సింగనల్లూరు అభ్యర్థి సూర్యప్రకాశ్ విజయానికి కాంగ్రెస్, డీఎంకే కార్యకర్తలు కలిసి పనిచేస్తున్నారు. అధికారం చేపట్టిన మొదటి 300 రోజుల్లోనే 3 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల కల్పన, రాష్ట్రంలోని ప్రతి మహిళలకు నెలకు రూ.2 వేలు ప్రత్యక్ష ఆర్థిక సాయం తదితర సంక్షేమ కార్యక్రమాలను అందించనున్న కాంగ్రెస్ కూటమిని బలపర్చాలి. శాంతిభద్రతలను, మహిళా సాధికారతను బలోపేతం చేసేందుకు మా కూటమి పది వేల మంది మహిళలను నియమించుకుంటుంది'' అని పేర్కొన్నారు.

## వలస పోవడానికి నేను అవకాశవాదిని కాదు

ఈ కబురు, తెలంగాణచౌక్(కరీంనగర్): వలస పోవడానికి తాను అవకాశవాదిని కాదని, రేవంత్‌రెడ్డిని అంతకంటే కాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టంచేశారు. బండి సంజయ్ ఏదో ఒక రాష్ట్రానికి వలసపోక తప్పదంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారని చెబుతూ ఆయన సోమవారం కరీంనగర్‌లో ప్రకటన విడుదల చేశారు. ''నా తుది శ్వాస వరకు భాజపాలోనే ఉంటా. నా శవంపై కప్పేది కాషాయ జెండానే. అది చూడటానికైనా మీరు నిండు నూరేళ్లు బతికి ఉండాలని కోరుకుంటున్నా. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లులతో జరిగే నష్టమేంటో చెప్పలేక రాజకీయం చేయాలనుకుంటున్నారా? డీలిమిటేషన్‌లో భాగంగా ప్రతి రాష్ట్రానికి 50% సీట్లు పెరిగితే దక్షిణాదికి జరిగే నష్టమేంటి? డబ్బు సమకూర్చే వాళ్లకే ప్రాధాన్యమివ్వాలని చెబుతారా? మీ లెక్క ప్రకారం ముంబయి, దిల్లీకి మాత్రమే అత్యధిక సీట్లు ఉండాలా? వెనుకబడ్డ ఆదిలాబాద్, పాలమూరు జిల్లాలకు సీట్లు పెంచాల్సిన అవసరం లేదా? మీ హైబ్రిడ్ మోడల్ అంటే మీలాగా, కాంగ్రెస్ పార్టీలాగా దోచుకునే వాళ్లకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలా? నా రక్తంలోనే జాతీయవాదమనే డీఎన్ఏ ఉంది. చావైనా, బతుకైనా కరీంనగరమే''అని పేర్కొన్నారు.

## పోరాడి సాధించుకున్నది ఎప్పటికీ గుర్తుండిపోతుంది

ఈ కబురు, దిల్లీ: ''కోట్ల మంది ప్రజల కోరికైన అమరావతి చట్టం నా హయాంలో రూపొందడం సంతోషంగా ఉంది. రైతులు రాష్ట్రంపై ప్రేమతో రాజధాని నిర్మాణానికి భూములిచ్చారు. వారి త్యాగం వెలకట్టలేనిది. పోరాడి సాధించుకున్నది చిరస్థాయిగా గుర్తుండిపోతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకుడు. ఆయన దూరదృష్టితో రాష్ట్రాన్ని, రాజధానిని అద్భుతంగా అభివృద్ధి చేస్తారన్న నమ్మకం ఉంది'' అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. పార్లమెంటు ఆమోదించిన అమరావతి బిల్లుకు రాజముద్ర వేసినందున ధన్యవాదాలు తెలిపేందుకు ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, కూటమి ఎంపీలతో కలిసి భేటీ అయినప్పుడు రాష్ట్రపతి వారితో ఈ మేరకు పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణ బిల్లు 2026'కు రాష్ట్రపతి ఈ నెల 6న ఆమోదముద్ర వేసి.. చట్టరూపం కల్పించినందుకు కృతజ్ఞతగా మంత్రి లోకేశ్ సోమవారం మధ్యాహ్నం తెదేపా, భాజపా, జనసేన ఎంపీలతో రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపదీ ముర్మును కలిసి ధన్యవాదాలు తెలిపారు. అమరావతిని అజరామరంగా నిలబెట్టినందుకు ఐదు కోట్ల మంది ఆంధ్రుల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ''విభజనతో ఏపీ కోలుకోలేని విధంగా నష్టపోయింది. ఈ సమయంలో రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లుకు దేశంలోని అన్ని పార్టీలూ మద్దతు పలికాయి. దానికి మీరు రాజముద్ర వేసి అమరావతికి శాశ్వతత్వం కల్పించినందుకు ప్రపంచవ్యాప్తంగా ఆంధ్రులు జేజేలు పలుకుతున్నారు. మా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్... మా రాజధాని అమరావతి అని ఆంధ్రజాతి సగర్వంగా చెప్పుకొనేలా చేశారు. అందుకోసం ఆంధ్రులందరి తరఫున కృతజ్ఞతలు'' అని రాష్ట్రపతితో లోకేశ్ అన్నారు. అనంతరం అమరావతి చరిత్ర, సంస్కృతి, రైతుల భూముల త్యాగం, రాజధానిలో చేపట్టిన అభివృద్ధి పనులు, గత ప్రభుత్వ పాలనలో ఎదురైన ఇబ్బందులు, 1,631 రోజులపాటు సాగిన రైతు ఉద్యమాల గురించి వివరించారు. ఇప్పుడు మాస్టర్‌ప్లాన్ ప్రకారం నిర్మాణాలు పూర్తయితే అమరావతి రాజధాని ఎలా ఉంటుందో సూచించే చిత్రాలను ఆయన రాష్ట్రపతి ముందు ప్రదర్శించారు. నిర్మాణ విశేషాలతో కూడిన పుస్తకాన్ని ఎంపీలతో కలిసి రాష్ట్రపతికి అందించారు. అనంతరం ద్రౌపదీముర్ము.. 'పోరాడి సాధించుకున్నది చిరస్థాయిగా గుర్తుండిపోతుంది'' అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, భాజపా ఎంపీ సీఎం రమేశ్, జనసేన నాయకుడు వల్లభనేని బాలశౌరితో పాటు తెదేపా ఎంపీలంతా పాల్గొన్నారు.

# ఇరాన్ దిగ్బంధనం!



**మీరు పోరుకు దిగితే.. మేమూ పోరాడతాం: ఘాలిబఫ్**

తమ ఓడరేవులు, హర్మూజ్ దిగ్బంధనంపై ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ బాఘర్ ఘాలిబఫ్ తీవ్రస్థాయిలో స్పందించారు. అమెరికా తమతో పోరుకు దిగితే.. తామూ పోరాడతామని స్పష్టం చేశారు. తమ సంకల్పాన్ని పరీక్షిస్తే, మరింత పెద్ద గుణపాఠం నేర్పుతామని హెచ్చరించారు. ఇకముందు పెట్రోలు ధరలు తలచుకొని అమెరికన్లు బాధపడతారని 'ఎక్స్'లో ఘాలిబఫ్ వ్యాఖ్యానించారు. మరోవైపు ఇరాన్ భద్రతకు ముప్పు వాటిల్లితే పర్షియన్ గల్ఫ్ ప్రాంతమంతటా సముద్ర భద్రత ప్రమాదంలో పడుతుందని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. అమెరికా దిగ్బంధనానికి ప్రతీకారంగా గల్ఫ్‌లో రేవులను మూసివేస్తామని పేర్కొంది. పర్షియన్ గల్ఫ్, ఒమన్ సముద్రంలో భద్రత అనేది ఉంటే అందరికీ ఉండాలని.. లేకపోతే ఎవరికీ ఉండకూడదని వ్యాఖ్యానించింది. తమ ఓడరేవులకు ముప్పు కలిగితే గల్ఫ్‌లో ఏ ఓడరేవూ సురక్షితంగా ఉండదని పేర్కొంది. ఇరాన్ అనుమతి పొందిన నౌకలకు మాత్రమే హర్మూజ్‌లోకి ప్రవేశించే వీలు కల్పిస్తామంది.

**'శాంతి.. యుద్ధం.. దేనికైనా సిద్ధమే'**

అమెరికా తమ షరతులకు అంగీకరించి, అక్రమ డిమాండ్లను పక్కనపెడితే.. దానితో మరో దఫా చర్చలు జరిపేందుకు సిద్ధమేనని ఇరాన్ ప్రకటించింది. భారత్‌లో ఆ దేశ రాయబారి మహమ్మద్ ఫతా అలీ విలేకర్ల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. శాంతికైనా, యుద్ధానికైనా తాము సిద్ధమేనని.. రెండింట్లో ఏది కావాలో వాషింగ్టనే తేల్చుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ శక్తేంటో అమెరికాకు బాగా తెలుసని వ్యాఖ్యానించారు.

అమెరికాఇరాన్ మధ్య ఈ నెల 8న కాల్పుల విరమణ అంగీకారం కుదిరాక హర్మూజ్‌లో రాకపోకలు పాక్షికంగా ప్రారంభమయ్యాయి. నాటి నుంచి 40 వాణిజ్య నౌకలు ఆ జలసంధిని దాటి ప్రయాణించాయి. పాక్‌లో శాంతి చర్చలు విఫలమవడం, అమెరికా దిగ్బంధన ప్రక్రియ ప్రారంభించడం వంటి పరిణామాలతో మళ్లీ హర్మూజ్‌లో ట్రాఫిక్ స్తంభించింది. ట్రంప్ పిలుపునిచ్చిన దిగ్బంధన ప్రక్రియలో తాము పాలుపంచుకోబోమని బ్రిటన్, ఫ్రాన్స్ సహా పలు నాటో దేశాలు స్పష్టం చేశాయి. హర్మూజ్ జలసంధిలో రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యేలా చూసేందుకు.. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో కలిసి ఈ వారం ప్రత్యేక సదస్సు ఏర్పాటుచేస్తానని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ప్రకటించారు.

అమెరికాఇరాన్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు తాము పూర్తిస్థాయిలో ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ తెలిపారు.

ఇజ్రాయెల్‌హెజ్‌బొల్లా మధ్య భీకర పోరు కొనసాగుతూనే ఉంది. దక్షిణ లెబనాన్‌లో వ్యూహాత్మకంగా కీలకమైన బింట్ జెబీల్ పట్టణంలో హెజ్‌బొల్లా ముష్కరులను ఇజ్రాయెల్ బలగాలు సోమవారం చుట్టుముట్టి దాడికి యత్నించాయి. దీంతో రాకెట్లు, శతఘ్నులతో వారు ప్రతిదాడులు చేశారు. లెబనాన్, ఇజ్రాయెల్ దౌత్యవేత్తలు అమెరికాలో మంగళవారం చర్చలు జరపనున్న సంగతి గమనార్హం.

ఖతార్ విదేశాంగ మంత్రి షేక్ మొహమ్మద్ బిన్ అబ్దుల్‌రహ్మాన్ అల్ థానీ, సౌదీ అరేబియా విదేశాంగ మంత్రి ప్రిన్స్ ఫైసల్ బిన్ ఫర్హాన్‌లతో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ విడివిడిగా ఫోన్‌లో మాట్లాడారు. అమెరికాతో తమ చర్చల వివరాలను వారికి తెలియజేశారు.

హర్మూజ్ దిగ్బంధనం అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా పెరిగేందుకు కారణమవుతుందని రష్యా హెచ్చరించింది.

హర్మూజ్‌ను మూసివేసే హక్కు ఏ దేశానికీ లేదని ఐక్యరాజ్య సమితి షిప్పింగ్ చీఫ్ అర్సెనియో డొమింగేజ్ స్పష్టం చేశారు.

## హైబ్రిడ్ నమూనాలో సీట్ల పునర్విభజన

**మహిళలకు సమాన అవకాశాలు కల్పించిందే కాంగ్రెస్**

కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనను ఒకటిగా చూపించి.. ప్రతిపక్షాలు సహకరించడం లేదని ప్రచారం చేస్తోంది. ఈ రెండు అంశాలు ఒకదానికొకటి సంబంధం లేనివి. చాలా దేశాల్లో మహిళలకు ఓటు హక్కు లేని రోజుల్లోనే.. పురుషులతో పాటు సమాన అవకాశాలు కల్పించింది కాంగ్రెస్ పార్టీ. ప్రధానిగా, రాష్ట్రపతిగా, లోక్‌సభ స్పీకర్‌గా, ముఖ్యమంత్రులుగా, గవర్నర్లుగా.. రాజ్యాంగబద్ధ పదవుల్లో మహిళలకు కాంగ్రెస్ అవకాశాలిచ్చింది. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తీసుకొచ్చింది రాజీవ్‌గాంధీ. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు తెచ్చిన చరిత్ర సోనియాగాంధీది. ఆమె నాయకత్వంలో అప్పుడు రాజ్యసభలో ఆమోదించారు. భాజపా సహకరించకపోవడం వల్లనే లోక్‌సభలో ఆమోదం పొందలేదు. పదేళ్లుగా మోదీ ఈ బిల్లును పట్టించుకోలేదు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 33% రిజర్వేషన్ కల్పించి ఉన్నట్లయితే.. 181 మంది మహిళలు ఎన్నికయ్యేందుకు అవకాశం ఉండేది. అప్పటినుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ అతివలకు మూడోవంతు సీట్లు దక్కేవి. మహిళలకు రిజర్వేషన్లు దూరం చేసిందే ఎన్‌డీయే ప్రభుత్వం. ఇప్పుడు 202627 జనాభా లెక్కలు పక్కనబెట్టి.. 2011 లెక్కల ప్రాతిపదికన మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన, పెంపు అంశాలను ముందుకు తెస్తున్నారు. ఈ రెండు కలపడంలో రాజకీయ కుట్ర, వివక్ష, అసమానతలు దాగిఉన్నాయి.

**దక్షిణాదికి నష్టం జరుగుతుందని గుర్తించే..**

ఆఖరిసారి 1971 జనాభా ప్రకారం సీట్ల పునర్విభజనను ఇందిరాగాంధీ హయాంలో చేశారు. 1970ల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కుటుంబ నియంత్రణ విధానాన్ని దక్షిణాది రాష్ట్రాలు పకడ్బందీగా అమలుచేయడంతో జనాభా తగ్గింది. ఇదే సమయంలో ఉత్తరాది రాష్ట్రాల్లో విపరీతంగా పెరిగింది. ఈ విషయాన్ని గమనించిన ఇందిరాగాంధీ.. 25 ఏళ్ల వరకు సీట్ల పెంపును నిషేధించారు. 2001లో వాజ్‌పేయీ ప్రభుత్వం కూడా మరో 25 ఏళ్ల వరకూ చట్టపరంగా సీట్ల పెంపుపై నిషేధం విధించింది. జనాభా ప్రాతిపదికన సీట్ల పునర్విభజనకు ఒప్పుకోబోమని దక్షణాది రాష్ట్రాలు తీవ్రంగా నిరసన తెలపడంతో పాటు.. ప్రధానికి లేఖ రాశాయి. దీంతో ఇప్పుడు దామాషా ప్రకారం 50 శాతం సీట్లు పెంచుతామనే ప్రతిపాదన తీసుకొచ్చారు. దీనివల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఉదాహరణకు 20 లోక్‌సభ సీట్లున్న కేరళకు.. 80 సీట్లున్న ఉత్తర్‌ప్రదేశ్‌కు మధ్య ఉన్న అంతరం 60 లోక్‌సభ స్థానాలు. యాభై శాతం దామాషా ప్రకారం పెంచితే.. కేరళకు 30.. యూపీకి 120 సీట్లు అవుతాయి. అంతరం 90 అవుతుంది. అలాగే దక్షిణాదిలో 130 నుంచి 195 అవుతాయి. ఉత్తరాదిలో 413 నుంచి 621కు సీట్లు పెరుగుతాయి. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. భాజపా హయాంలో దక్షిణాది రాష్ట్రాల నుంచి కేంద్రంలో ఒక్క కీలకమైన శాఖను కూడా ఇవ్వలేదు. రాజకీయాల్లో నంబర్ ఉంటేనే ఎవరైనా పట్టించుకుంటారు. వాజ్‌పేయీ ప్రభుత్వం ఒక్క ఓటుతో పడిపోయింది. దిల్లీ, పంజాబ్ వంటి ఉత్తరాది చిన్నరాష్ట్రాలు కూడా రాజకీయ మనుగడ కోల్పోతాయి. అందుకే ఏ ప్రాతిపదికన సీట్లు పెంచాలనే దానిపై మొదట చర్చించాలి. దక్షిణాది రాష్ట్రాల పట్ల వివక్షను మరింత పెంచేలా భాజపా చేస్తున్న ప్రయత్నమిది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, మావోయిస్టులు వంటి సమస్యలూ వివక్ష వల్లనే వచ్చాయి. దక్షిణాది రాష్ట్రాలు ఆర్థిక రాజధానులు. ఉత్తరాది రాష్ట్రాలు రాజకీయ రాజధానులు. పన్నులు కట్టడం, సలామ్ కొట్టడానికి మేము వ్యతిరేకం. దీర్ఘకాలంలో దేశానికి ఇది పెను విపత్తుగా మారుతుంది. 100 శాతం జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు జరగలేదు.. ప్రాతినిధ్యం కోసమే ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎంపీ సీట్లు ఇచ్చారు. జనాభా ప్రాతిపదికన, దామాషా పద్ధతిలో సీట్లు పెంచొద్దు. అలా చేస్తే దక్షిణాది రాష్ట్రాలు ద్వితీయ శ్రేణి పౌరులుగా మిగిలిపోవాల్సి వస్తుంది. 2027 మార్చిలోగా జనగణన పూర్తిచేయాలి. ఈలోపు సీట్ల పునర్విభజనపై అఖిలపక్ష సమావేశంతో పాటు.. పౌర సమాజం, మేధావులు, అన్ని సంస్థలతో సంప్రదింపులు చేయాలి. పార్లమెంటులోనూ దీనిపై చర్చించాలి. నిపుణులతో కమిటీ వేయాలి. అసెంబ్లీల్లో చర్చకు పెట్టి.. పార్లమెంటులో ఆమోదించి నిర్ణయం తీసుకోవాలి. 2028 మార్చి వరకు ఈ ప్రక్రియను పూర్తి చేయొచ్చు. ఆలోగా హడావుడిగా చేసి.. దేశంలో దక్షిణాది, ఉత్తరాది మధ్య అంతరం పెంచొద్దు.

**ఒక్క మహిళనైనా భాజపాలో అధ్యక్షురాలిగా చేశారా?**

1980లో ఏర్పాటైన భాజపాకు ఇప్పటి వరకు 15 మంది అధ్యక్షులయ్యారు. ఒక్క మహిళనైనా అధ్యక్షురాలిని చేశారా. మహిళను అధ్యక్షురాలిగా నియమించుకున్న తర్వాత బండి సంజయ్ మాట్లాడాలి. ఆయన వ్యాఖ్యలు దక్షిణాది రాష్ట్రాల్లోని ఎస్సీ, ఎస్టీ, మహిళలకు వ్యతిరేకం. 50% సీట్ల పెంపును కిషన్‌రెడ్డి, సంజయ్ ఆమోదిస్తే.. వారి అవసరం ఇకముందు కేంద్రప్రభుత్వానికి ఉండదు. కేటీఆర్ కూడా 50% సీట్ల పెంపుపై మోదీకి అనుకూలంగా మాట్లాడుతున్నారు. మా ఎంపీలు తెలంగాణను సాధించారు. పునర్విభజనపై కూడా పోరాడతారు. దక్షిణాది రాష్ట్రాలతోపాటు చిన్న రాష్ట్రాలను ఏకం చేస్తాం. పార్లమెంట్‌లో బిల్లును ఎలా ఆమోదిస్తారో చూస్తాం'' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, ఎంపీలు రఘురాంరెడ్డి, సురేశ్ షెట్కార్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మల్లు రవి, వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

## భారాస కూల్చిన రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మిస్తున్నాం

ఈకబురు,హైదరాబాద్: భారాస ప్రభుత్వం కుప్పకూల్చిన రెవెన్యూ వ్యవస్థను సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పునర్నిర్మిస్తోందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూ హక్కుల పరిరక్షణ, పారదర్శకతతో కూడిన అవినీతి రహిత సేవలు సామాన్యులకు అందించే లక్ష్యంతో అమల్లోకి వచ్చిన భూభారతి చట్టం రాష్ట్ర చరిత్రలో కీలక సంస్కరణగా నిలుస్తోందన్నారు. భూభారతి చట్టం అమల్లోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సోమవారం అధికారులతో మంత్రి సమీక్షించారు. భూభారతి చట్టానికి ముందు, ఆ తరువాత ఉన్న పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'గత ప్రభుత్వ పాలకులు సరైన విధివిధానాలు లేకుండా ఆర్వోఆర్ చట్టం2020, ధరణి పోర్టల్ తీసుకొచ్చారు. దీంతో లక్షల మంది భూహక్కుల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భూమి వారి చేతుల్లోనే ఉన్నా హక్కులు నిరూపించుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి తలెత్తింది. ఆ అవస్థలను తప్పించాలనే సంకల్పంతో పారదర్శకత, బాధ్యత, వేగం అనే మూడు సూత్రాలతో రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువచేయాలనుకున్నాం. గత ఏడాది ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి రోజున సీఎం చేతుల మీదుగా భూభారతి పోర్టల్‌ను ఆవిష్కరించాం. ప్రారంభించిన ఏడాదిలోపే 5.20 కోట్లకుపైగా ప్రజలు పోర్టల్‌ను సందర్శించారు. 67 లక్షల మంది పోర్టల్‌లో లాగిన్ అయ్యారు'' అని వెల్లడించారు.

**ఐదు మండలాల్లో ప్రతి సర్వే నంబరుకు భూదార్**

రైతులకు పారదర్శకంగా సేవలు అందించేందుకు.. రెవెన్యూ, సర్వే, స్టాంపులు రిజిస్ట్రేషన్ల విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చేందుకు..కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐసీతో కలిసి ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను ఈ నెల 2న ఐదు జిల్లాల్లోని..ఐదు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామని మంత్రి వెల్లడించారు. 'ఐదు మండలాల్లో ప్రతి సర్వే నంబరుకు భూదార్ నంబర్‌ను కేటాయిస్తాం. రాష్ట్రంలో నక్షాలు లేని 373 గ్రామాల్లో రోవర్స్, ఆధునిక సర్వే సాంకేతికతతో రీసర్వే పనులు చేపట్టాం. తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు వినియోగంలో ఉండగా, ప్రస్తుతం 2.29 కోట్లకు చేరాయి. వీటన్నింటికీ భూదార్ ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. అందుకోసం 5,520 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించాం. రాష్ట్రంలోని 10,984 రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి జీపీవోలను నియమించాం. భూభారతి పోర్టల్ ప్రారంభించాక 3.80 లక్షల కొత్త పాసుపుస్తకాలు జారీ చేశాం' అని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.



## మహిళా రిజర్వేషన్ చట్టం ఈ శతాబ్దపు అతి పెద్ద నిర్ణయం

ఈకబురు,దిల్లీ: 'చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లను అమలు చేయాలన్నది 21వ శతాబ్దపు అతి పెద్ద నిర్ణయాల్లో ఒకటి. మన పార్లమెంటు సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతోంది. సామాజిక న్యాయం కేవలం ఒక నినాదం కాదు. అది మన పని సంస్కృతిలో భాగమని దీని ద్వారా నిరూపిస్తున్నాం. రాష్ట్ర అసెంబ్లీల నుంచి పార్లమెంటు వరకూ దశాబ్దాలుగా కొనసాగుతున్న నిరీక్షణకు ఈ నెల 16, 17, 18 తేదీలతో తెరపడనుంది. 2023లో కొత్త పార్లమెంటు భవనంలో తొలి బిల్లుగా నారీ శక్తి వందన్ అధినియంను ఆమోదించి మొదటి అడుగేశాం. ఆ చట్టాన్ని త్వరగా అమల్లోకి తేవడానికి ఈ నెల 16 నుంచి 18 వరకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను నిర్వహించబోతున్నాం' అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 2029 సార్వత్రిక ఎన్నికల నుంచి చట్టసభల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లను అమలు చేసే చట్టానికి సంబంధించిన అనుబంధ సవరణలను పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదించబోతున్న తరుణంలో చట్టంపై మహిళల్లో విస్తృతంగా అవగాహన కల్పించేందుకు దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో సోమవారం నిర్వహించిన నారీ శక్తి వందన్ సమ్మేళన్‌లో ఆయన ప్రసంగించారు.

**ఏకగ్రీవమవుతుందని ఆశిస్తున్నాం**

'చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్ల అంశాన్ని దశాబ్దాలుగా ఎవరో ఒకరు ప్రస్తావిస్తూనే వస్తున్నారు. నిరంతరం చర్చలూ సాగుతూ వచ్చాయి. అందులోనే దాదాపు 4 దశాబ్దాలు గడిచిపోయింది. ఈ ఆలోచనను ప్రతి పార్టీ తమదైన శైలిలో ముందుకు తీసుకెళ్లింది. 2023లో నారీ శక్తి వందన్ అధినియంను అన్ని పార్టీలూ ఏకగ్రీవంగా ఆమోదించాయి. ఈ రిజర్వేషన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ 2029 నుంచి అమలు చేసి తీరాల్సిందేనని ప్రతిపక్షాలు కోరాయి. అవి ఏదైనా ముఖ్యమైన అంశంపై డిమాండు చేస్తే ప్రభుత్వం దాన్ని సీరియస్‌గా తీసుకుంటుంది. అందుకే విస్తృతంగా చర్చలు, మథనం జరిపి, రాజ్యాంగ నిపుణుల సలహాలు తీసుకొని 2029లో అమల్లోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ఏర్పాటు చేస్తున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో విస్తృత చర్చలు జరుగుతాయి. చర్చలు, సహకారం, సహభాగస్వామ్యం ద్వారా ఈసారీ ఏకగ్రీవంగా ఆమోదం పొందుతుందని నేను ప్రగాఢంగా నమ్ముతున్నా' అని ప్రధాని పేర్కొన్నారు.

**మహిళల కలలకు కొత్త రెక్కలు**

'శాసనసభలు, పార్లమెంటులో అడుగు పెట్టాలన్న మహిళల కలలకు ఇప్పుడు కొత్త రెక్కలొస్తున్నాయి. స్వాతంత్ర్యానంతరం చట్టసభలకు ప్రాతినిధ్యం వహించిన మహిళలంతా అద్భుతంగా పని చేశారు. రాష్ట్రపతి నుంచి ప్రధాన మంత్రి వరకూ మహిళలు ఎక్కడ పని చేసినా తమదైన ముద్ర వేశారు. ఇప్పుడూ రాష్ట్రపతి నుంచి ఆర్థిక మంత్రి వరకు ముఖ్యమైన పదవులన్నీ మహిళలే నిర్వర్తిస్తూ దేశ గౌరవ ప్రతిష్ఠలను పెంచుతున్నారు. ప్రస్తుతం దేశంలోని పంచాయతీలకు 14 లక్షల మందికిపైగా మహిళలు ప్రాతినిధ్యం వహిస్తూ విజయవంతంగా సేవలందిస్తున్నారు. 21 రాష్ట్రాల్లోని స్థానిక సంస్థల్లో మహిళల భాగస్వామ్యం దాదాపు 50%కి చేరుకుంది. నిర్ణయ ప్రక్రియలో మహిళల భాగస్వామ్యం పెరగడంవల్ల వ్యవస్థలో సంవేదన శీలత వచ్చిందని ఎన్నో అధ్యయనాలు చెబుతున్నాయి. వారివల్ల తాగునీరు, విద్య, వైద్యం, పోషకాహారం వంటి విభాగాల్లో అద్భుతమైన పనులు జరిగాయి. జల్‌జీవన్ మిషన్ అందుకు ప్రబల ఉదాహరణ. నేను 2001లో కొత్తగా ముఖ్యమంత్రి అయిన తర్వాత గుజరాత్‌లోని పంచాయతీకి సర్పంచిగా పని చేస్తున్న ఓ మహిళతోపాటు మరో 12 మంది సభ్యురాళ్లు నా వద్దకు వచ్చినప్పుడు ఐదేళ్లలో మీరు ఏం చేయాలనుకున్నారని అడిగాను. వారు అది చేస్తాం.. ఇది చేస్తాం... అని చెప్పకుండా గ్రామంలో పేదరికం లేకుండా చేయాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. ఆ మాట నన్ను ఆశ్చర్య చకితుణ్ని చేసింది. వారి నోట వచ్చిన ఆ మాట నాకు ఇప్పటికీ చెవుల్లో మారుమోగుతూనే ఉంటుంది. ముఖ్యమంత్రి అయినా, ప్రధానమంత్రి అయినా అదే నాకు పాఠంగా, మార్గదర్శకంగా పని చేస్తోంది' అని మోదీ వివరించారు.




**వికసిత్ భారత్‌లో అత్యంత కీలకం**

'వికసిత్ భారత్‌లో ప్రయాణంలో మహిళల భూమిక అత్యంత కీలకం. 2014 నుంచి ఇప్పటివరకూ మా ప్రభుత్వం మహిళల జీవితంలోని ప్రతి దశకూ ఓ పథకాన్ని రూపొందించి విజయవంతంగా అమలు చేసింది. తొలి శ్వాస నుంచి తుది శ్వాస వరకు ఏదో ఒక పథకం ద్వారా దేశంలోని మహిళామణుల జీవితాలకు అండగా నిలుస్తోంది. ఈ దేశంలోని ప్రతి తల్లి, సోదరి, కుమార్తె కలలను సాకారం చేసేందుకు మేం చర్యలు తీసుకుంటున్నాం. మహిళామణుల శ్రమ, ధైర్యం, ఆత్మ స్థైర్యంతో నారీ శక్తి ఇప్పుడు కొత్త శిఖరాలను తాకింది. అందరూ కలిసికట్టుగా ఈ శక్తికి కొత్త ఇంధనాన్ని అందించాలి. వారి అవకాశాలను విస్తృతం చేయాలి' అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

# గోపన్ పల్లిలో బాటా షోరూమ్ ను ప్రారంభించిన పల్లపు సురేందర్


నూతన బాటా షోరూమ్ ను ప్రారంభిస్తున్న పల్లపు సురేందర్


షోరూం నిర్వాహకులతో సురేందర్

**కష్టమర్ల అభిరుచికి అనుగుణంగా పనిచేసే వ్యాపారాలకు మనుగడ : సురేందర్**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం నల్లగండ్ల డివిజన్ పరిధిలోని గోపనపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'బాటా షోరూమ్' ను సోమవారం నల్లగండ్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లపు సురేందర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో షోరూం నిర్వాహకులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం పల్లపు సురేందర్ మాట్లాడుతూ కష్టమర్ల అభిరుచికి అనుగుణంగా నిర్వహించే ఏ వ్యాపారమైన మనుగడ సాగిస్తుందన్నారు. మార్కెట్లో అందుబాటులో ఉన్న నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ, యువత ఫ్యాషన్ ను దృష్టిలో ఉంచుకొని వ్యాపారం సాగించాలని నిర్వాహకులకు సూచించారు. నేటి యువత మొత్తం ఉద్యోగాల వేటలో పోటీ పడుతున్నారని, దీని కారణంగా ఒక్కో ఉద్యోగానికి వందల నుంచి వేల సంఖ్యలో పోటీ ఏర్పడుతుందన్నారు. జీవితంలో ఎదగాలంటే ఉద్యోగం ఒక్కటే మార్గం కాదని, స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు., వ్యాపార సంస్థలు అభివృద్ధి చెందడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి ఇవి ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, షో రూమ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# సాఫ్టువేర్ ఉద్యోగం చేస్తూ గంజాయి విక్రయించే ప్లాన్

**ఐటీ కారిడార్ లో పోలీసుల దాడులు - ఇద్దరి అరెస్టు**
**రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం**

ఈకబురు, శేరిలింగంపల్లి : సాఫ్టువేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్న యువకుడు డబ్బు సంపాదన కోసం గంజాయి విక్రయించేందుకు చూసి పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. ఐటి కారిడార్ పరిధిలో సాఫ్టువేర్ ఉద్యోగితో పాటు ఓ క్యాబ్ డ్రైవర్ ను సైతం అరెస్టు చేసిన పోలీసులు వీరి వద్ద నుంచి రెండున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరికి గంజాయిని సరఫరా చేసిన నిందితుడితో పాటు మరో వ్యక్తి పరారీలో ఉన్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. గచ్చిబౌలి ఐటి కారిడార్ పరిధిలోని నానక్ రాంగూడ హనుమాన్ గుడి సమీపంలో గంజాయి విక్రయిస్తున్నాదనే సమాచారంతో గచ్చిబౌలి పోలీసులు, శేరిలింగంపల్లి ఎస్ఓటీ పోలీసులు ఆదివారం అర్ధరాత్రి సమయంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సాఫ్టువేర్ ఇంజనీర్ ప్రేమానంద్ మాలిక్(24), క్యాబ్ డ్రైవర్ విషాల్ (26)లు వట్టుబడ్డారు. వీరి నివాసంలో సోదాలు చేయగా మూడు కవర్లలో ప్యాక్ చేసి ఉంచిన 2.592కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఓడిస్సాకు చెందిన రాఘవేంద్ర వద్ద నుంచి సదరు గంజాయిని కొనుగోలు చేసి ఎక్కువ డబ్బుకు నగరంలో విక్రయించాలని పథకం వేసినట్లు నిందితులు అంగీకరించారు. దీంతో ప్రేమానంద్ తో పాటు విషాల్ లను అరెస్టు చేసిన పోలీసులు రిమాండుకు తరలించారు. మరో ఇద్దరు నిందితులు రాఘవేంద్ర, ఆకాష్ లు పరారీలో ఉన్నట్లు తెలిపారు.



గంజాయి విక్రయిస్తు పోలీసులకు పట్టుబడిన సాఫ్టువేర్ ఉద్యోగి ప్రేమానంద్కల్చరల్ ట్రూప్


నిందితుల వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

# గచ్చిబౌలి పిజెఆర్ ఫ్లైఓవర్ మీద రోడ్డు ప్రమాదం



ప్రమాదంలో మృతిచెందిన వికాస్ కుమార్ (ఫైల్ )

**యువకుడు మృతి - మరో యువకుడికి తీవ్ర గాయాలు**

ఈకబురు, శేరిలింగంపల్లి : టిఫిన్ చేసేందుకని రెండు ద్విచక్రవాహనాల మీద ఐటి కారిడార్ కు వచ్చిన నలుగురు స్నేహితుల్లో ఇద్దరు రోడ్డు ప్రమాదానికి గురికాగా, అందులో ఒకరు చనిపోగా.. మరొకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నారు. గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబందించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకులం జిల్లాకు చెందిన పిల్లి కళ్యాణ్ (28) హాఫీజ్ పేట్ పరిధిలోని మార్తాండనగర్ లో నివాసం ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కాగా శనివారం ఇతని వద్దకు స్నేహితులైన గణేష్, పుప్పాలగూడలో నివాసం ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న వికాస్ కుమార్ నేవక్ 25) భరత్ కుమార్ లు వచ్చారు. వీరంతా కలిసి ఆదివారం తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో టిఫిన్ చేసేందుకు బయటకు వచ్చారు. భరత్ కుమార్ నడుపుతున్న (ఓడి07ఏఎం8238) బైక్ మీద వికాస్ కుమార్ నేవక్ కూర్చోగా, గణేష్ నడుపుతున్న (ఏపి10 బిఎం8151) బైక్ మీద కళ్యాణ్ కూర్చున్నారు. నలుగురు కలిసి హాఫీజ్ పేట్ నుంచి నానక్ రాంగూడకు వెళ్లారు. అక్కడ టిఫిన్ కనిపించకపోవడంతో తిరిగి హాఫీజ్ పేట్ వైపు వాహనాలు మళ్లించారు. భరత్ కుమార్, వికాస్ లు వెళ్తున్న బైక్ ముందు వెళ్తుండగా, గణేష్ కళ్యాణ్ బైక్ వారిని అనుసరించసాగింది. ఆ క్రమంలో మార్గమధ్యలో గచ్చిబౌలి వీజెఆర్ ఫ్లైఓవర్ వద్ద భరత్ కుమార్ బైకు వేగంగా, నిర్లక్ష్యంగా నడువడంతో ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు డివైడర్ ను ఢీకొట్టింది. దీంతో భరత్ కుమార్, వికాస్ లు బైక్ మీద నుంచి ఎగిరి కిందవడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయలు కావడంతో వెనక బైక్ మీద ఉన్న స్నేహితులు ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. వికాస్ కుమార్ నేపక్ పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. భరతకుమార్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడుతున్నాడు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు వికాస్ మృతదేహాన్ని పోస్టుమార్ధం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుపై రాజకీయం వద్దు

ఈ కబురు, హైదరాబాద్:

మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో రాజకీయం చేయవద్దని... సీఎం రేవంత్‌రెడ్డి అవగాహనా లోపంతో ఈ బిల్లుపై లేనిపోనివి మాట్లాడుతున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం హైదరాబాద్ మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన మైనింగ్ రోడ్ షో కార్యక్రమానికి హాజరైన కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ''పార్లమెంట్, అసెంబ్లీలో మహిళలకు 33% రిజర్వేషన్ల కల్పనకే ప్రధాని మోదీ ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. దశాబ్దాలపాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్లపై ఎప్పుడూ సానుకూలంగా స్పందించలేదు. ఈ బిల్లును అమలు చేయాలంటే నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ కేటగిరీల్లో కూడా మహిళలకు రిజర్వేషన్లు కల్పించాల్సి ఉన్నందున పునర్విభజన లేకుండా సాధ్యం కాదు. 2011 జనాభా లెక్కల ప్రకారం.. సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలోని కమిటీ ద్వారా నిష్పక్షపాతంగా పునర్విభజన ప్రక్రియ జరుగుతుంది. ఇందుకు కనీసం రెండేళ్ల సమయం పడుతుంది. జనాభా ప్రాతిపదికన దక్షిణాది రాష్ట్రాలకు సీట్లు తగ్గి అన్యాయం జరుగుతుందన్న ప్రచారం సరికాదు. మోదీ ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు సమన్యాయం చేసేందుకు కృతనిశ్చయంతో ఉంది. పునర్విభజన తర్వాత చప్రాసీ జాబ్ కూడా రాదంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా. పదవుల కోసం దిల్లీకి డబ్బులు మోస్తూ తిరుగుతున్నది రేవంత్‌రెడ్డే తప్ప భాజపాలో అలాంటి సంస్కృతి లేదు'' అని పేర్కొన్నారు.

-పారదర్శకంగా మైనింగ్ బ్లాకుల కేటాయింపు

అంతకుముందు ''క్రిటికల్ మినరల్ బ్లాక్స్ 7వ దశ వేలం, రెండో విడత ఖనిజాల వెలికితీత లైసెన్స్ రోడ్ షో'' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... ''గతంలో సిఫార్సుల మీద ఆధారపడి మైనింగ్ అనుమతులుండేవి. ప్రస్తుతం మైనింగ్ బ్లాకుల కేటాయింపు 100% పారదర్శకంగా వేలం ద్వారా జరుగుతోంది. రక్షణ, స్పేస్ టెక్నాలజీ, సౌరవిద్యుత్, మొబైల్ తయారీ వంటి రంగాల్లో క్రిటికల్ మినరల్స్ ఆవశ్యకతను గుర్తించి, కేంద్రం రూ.32వేల కోట్లతో నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌ను ప్రారంభించింది. విదేశాల్లోనూ మైనింగ్ బ్లాక్‌లను దక్కించుకొని భారత్‌కు అవసరమైన ఖనిజాలు తరలించేలా వ్యూహాత్మక ఒప్పందాలు చేసుకుంటున్నాం. స్వాతంత్ర్యం వచ్చాక మొదటిసారి వరసగా రెండేళ్లు ఒక బిలియన్ టన్నుల చొప్పున బొగ్గు ఉత్పత్తిని సాధించాం. దేశంలోరానున్న 90 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయి. కోల్ గ్యాసిఫికేషన్ ద్వారా దిగుమతులను తగ్గించేందుకు రూ.8,500 కోట్ల రాయితీలతో ఏడు ప్రాజెక్టులను మంజూరు చేశాం' అని చెప్పారు. రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ...''గనుల కేటాయింపులో తెలంగాణ ప్రభుత్వ పారదర్శకత విధానం కారణంగా ఆదాయం గణనీయంగా పెరిగింది. ఇసుక రంగంలో అక్రమాలను అరికట్టడం ద్వారా ఆదాయాన్ని 33 శాతానికి పైగా పెంచగలిగాం'' అని పేర్కొన్నారు.

# కాలనీ సంక్షేమ సంఘాలు కాలనీల అభివృద్ధికి కృషి చేయాలి నిమ్మల ధాత్రీనాథ్ గౌడ్

ఈకబురు, శేరిలింగంపల్లి : కాలనీ సంక్షేమ సంఘాలు తమ కాలనీల అభివృద్ధికి కృషి చేయాలని, స్థానిక ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండాలని

హఫీజ్ పేట్ డివిజన్ యువ నాయకులు నిమ్మల ధాత్రినాథ్ గౌడ్ సూచించారు. హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని ప్రజయ్ సిటీ రెసిడెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, తన ప్యానెల్ సభ్యులు ఉపాధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సంపత్, కృష్ణ, గౌతమ్, ఆకాష్ తదితరులు సోమవారం దాత్రినాథ్ గౌడ్ ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అసోసియేషన్ దాత్రినాథ్ గౌడ్ ను ఘనంగా సన్మానించారు. ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజాతి నూతన అసోసియేషన్ సభ్యులను అభినందించిన దాత్రినాథ్ గౌడ్ ఘనంగా సన్మానించారు. అనంతరం కాలనీ అభివృద్ధికి చేపట్టవలసిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ అసోసియేషన్ కార్యవర్గానికి ఎన్నికైన సభ్యులు స్థానిక ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించాలని, అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.


నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ సభ్యులను సన్మానిస్తున్న ధాత్రినాథ్ గౌడ్

# భాజపా ఇప్పుడు డబ్బులిచ్చి... తర్వాత కేసులు పెడుతుంది: మమత

సూరి: శాసనసభ ఎన్నికల్లో తనను ఓడించడానికి ఎన్డీఏ పాలనలో ఉన్న 19 రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం కలిసి పనిచేస్తున్నాయని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం ఆరోపించారు. సామాన్య ప్రజల కోసం తాను వారం దరితో ఒంటిచేత్తో పోరాడుతున్నట్టు ఆమె బీర్‌భుమ్ జిల్లాలోని సూరిలో జరిగిన ర్యాలీలో ప్రసంగిస్తూ అన్నారు. కేంద్ర బలగాలను ఉపయోగించి భాజపా పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో విజయం సాధించడం కల్ల అని ఆమె స్పష్టం చేశారు. ''తృణమూల్ కాంగ్రెస్ ఈసారి 226 సీట్లు గెలిచి మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది'' అని మమత ప్రకటించారు. ''వాళ్లు (భాజపా) డబ్బులు పంచుతున్నారు. డబ్బు పంపకాన్ని నిలువరించే అవకాశం లేకుండా రాష్ట్రానికి చెందిన బ్యూరోక్రాట్లను, పోలీసు ఉన్నతాధికారులను ఇతర రాష్ట్రాలకు బదిలీ చేసేశారు. డబ్బుతోపాటు మాదక ద్రవ్యాలు, ఆయుధాలు కూడా పంచుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఓటర్లను పశ్చిమ బెంగాల్‌లోకి తీసుకొస్తున్నారు. బిహార్ తదితర రాష్ట్రాల నుంచి రైళ్లు, బస్సుల్లో నకిలీ ఓటర్లను తరలిస్తున్నారు'' అని మమత ఆరోపించారు. యువ హృదయాలపై ప్రభావం చూపేందుకు ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వాడుకుంటున్నారు అని అన్నారు. భాజపా నుంచి డబ్బు తీసుకుంటే రానున్న రోజుల్లో ఇబ్బందులు పడతారని ఓటర్లను హెచ్చరించారు. ''మీ ఖాతాల్లో డబ్బు పడేసి

# అంత తొందరేంటి?

ఈ కబురు, దిల్లీ:
కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రతిపాదించిన డీలిమిటేషన్ అత్యంత ప్రమాదకరమని, రాజ్యాంగంపై జరుగుతున్న దాడి అని కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ ధ్వజమెత్తారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల ద్వారా ఈ వారంలో కేంద్రం తేవాలనుకుంటున్న బిల్లు.. డీలిమిటేషన్‌కు సంబంధించినదని, మహిళా రిజర్వేషన్లకు సంబంధించినది కాదని స్పష్టం చేశారు. లోక్‌సభలో చేపట్టే ఏ డీలిమిటేషన్ అయినా సంఖ్యాపరంగా కాకుండా రాజకీయ సమానత్వం సాధించేదిగా ఉండాలని స్పష్టం చేశారు. కుల గణనను ఆలస్యం చేయడమే ప్రధాని మోదీ ఉద్దేశమని ఓ పత్రికకు రాసిన వ్యాసంలో సోనియా ఆరోపించారు.'పార్లమెంటు ప్రత్యేక సమావేశాల ద్వారా బుల్డోజ్ చేయాలనుకుంటున్న చట్ట అనుబంధ సవరణలకు ప్రతిపక్షాలు మద్దతివ్వాలని ప్రధాని కోరుతున్నారు. అదీ తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ప్రచారం ఉద్ధృతంగా సాగుతున్న సమయంలో కావడం గమనార్హం. ఇంత అత్యవసరంగా దీనిని చేపట్టడానికి ఒకే కారణముంది. అదే రాజకీయ లబ్ధి పొందడం.. ప్రతిపక్షాలను ఆత్మరక్షణలో పడేయడం. ఎప్పటిలాగే ప్రధాని నిజాన్ని దాస్తున్నారు' అని సోనియా విమర్శించారు. '2023 సెప్టెంబరులో జరిగిన పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో నారీ శక్తి అధినియం బిల్లు ఆమోదం పొందింది. రాజ్యాంగంలో ఆర్టికల్ 334ఏను ఇది చేర్చింది. దీని ప్రకారం.. జన గణన, దాని ఆధారంగా డీలిమిటేషన్ పూర్తయ్యాక మహిళలకు చట్టసభల్లో మూడో వంతు రిజర్వేషన్లు కల్పించాల్సి ఉంది. ప్రతిపక్షాలు ఈ నిబంధనను కోరలేదు. వాస్తవానికి అప్పట్లోనే మహిళా రిజర్వేషన్లను 2024 నుంచే అమలు చేయాలని ఖర్గే డిమాండు చేశారు. దీనికి ప్రభుత్వం అంగీకరించలేదు. ఇప్పుడు మళ్లీ ఆర్టికల్ 334ఏను సవరించి 2029 నుంచే అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మాకు అర్థమవుతోంది. ఈ యూటర్న్ తీసుకోవడానికి ప్రధానికి 30 నెలలు ఎందుకు పట్టింది. ప్రత్యేక సమావేశాలను నిర్వహించడానికి మరికొన్ని వారాలు ఎందుకు ఆగలేకపోతున్నారు' అని సోనియా నిలదీశారు.

15న విపక్షాల సమావేశం: ఖర్గే

మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని ఎలా అమలు చేయాలో చర్చించేందుకు ఈ నెల 15న జాతీయ స్థాయిలో విపక్షాలన్నీ సమావేశం కానున్నట్లు రాజ్యసభ విపక్ష నేత, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. ఆయన సోమవారం బెంగళూరులో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ల చట్టంతో కలిపి డీలిమిటేషన్ చేయడం ఉత్తర, దక్షిణాల విభజనకు దారి తీస్తుందని కాంగ్రెస్ అభిప్రాయపడింది. సంఖ్యాపరంగా డీలిమిటేషన్ చేయడం సరికాదని, దీనివల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక మూల్యం చెల్లించకూడదని స్పష్టం చేసింది.

కులగణనతో సామాజిక న్యాయం

'2027 కుల గణనను డిజిటల్ విధానంలో చేపడుతున్నామని ఎన్నికల అధికారులు ఘనంగా ప్రకటించుకున్నారు. వచ్చే ఏడాదిలో జనాభా లెక్కలన్నీ తెలుస్తాయి. దీంతోపాటు వెల్లడయ్యే కుల గణనద్వారా సామాజిక న్యాయం, సాధికారతకు అవకాశం ఉంది. డీలిమిటేషన్‌వల్ల జనాభాను తగ్గించిన రాష్ట్రాలకు అన్యాయం జరగడానికి వీల్లేదు' అని సోనియా స్పష్టం చేశారు.

# ఇలాంటి పోప్ నాకొద్దు: ట్రంప్

ఈ కబురు, వాషింగ్టన్:
అమెరికాలో జన్మించిన తొలి పోప్ లియో 14, అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌ల మధ్య మాటల యుద్ధం తీవ్రరూపం దాల్చింది. పశ్చిమాసియా యుద్ధంపై పోప్ చేసిన వ్యాఖ్యలు, వాటిపై ట్రంప్ ఘాటు స్పందనతో వాతావరణం వేడెక్కింది. నేను వైట్‌హౌస్‌లో లేకుంటే లియో అసలు పోప్ అయ్యేవారే కాదని, ఆయన వామపక్ష తీవ్రవాదులకు మద్దతు పలుకుతున్నారని ట్రంప్ పేర్కొనగా, ట్రంప్ ప్రభుత్వానికి తాను భయపడటం లేదని, క్రైస్తవ సువార్త ఆధారంగానే తాను శాంతికి పిలుపునిచ్చానని పోప్ స్పష్టం చేశారు. అసలింతకీ ఏం జరిగిందంటే.. ఇరాన్‌పై అమెరికా యుద్ధాన్ని పోప్ ఖండిస్తూ.. 'సర్వశక్తిమంతులమనే భ్రమ, అధికార మోహం యుద్ధాలకు దారితీస్తోంద'ంటూ ఇటీవల వ్యాఖ్యానించారు. అయితే పోప్ తన వ్యాఖ్యల్లో నేరుగా ట్రంప్ పేరును ప్రస్తావించలేదు. అయినప్పటికీ ఈ వ్యాఖ్యలు ట్రంప్‌నకు రుచించలేదు. ఈ నేపథ్యంలోనే ట్రంప్ ఆదివారం రాత్రి పోప్ లియో 14పై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ సామాజిక మాధ్యమంలో సుదీర్ఘమైన పోస్టు పెట్టారు. ''పోప్ వామపక్ష తీవ్రవాదులకు అనుకూలంగా వ్యవహరిస్తూ, విదేశాంగ విధానాలపై తప్పుడు వైఖరి అవలంబిస్తున్నారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలున్నా అభ్యంతరం లేదని చెప్పే పోప్ నాకు అవసరం లేదు. వెనెజువెలాపై అమెరికా సైనిక చర్యను తప్పుపట్టే పోప్ అక్కర్లేదు. దేశాధ్యక్షుణ్ని విమర్శించే పోప్ నాకొద్దు. అమెరికా ప్రజలు నాకు అఖండ విజయాన్ని కట్టబెట్టారు. వారు కోరుకున్నదే మా ప్రభుత్వం చేస్తోంది'' అని ట్రంప్ తన పోస్టులో ఘాటు వ్యాఖ్యలు చేశారు. ''పోప్ నా ప్రభుత్వం వల్ల భయం కలుగుతున్నట్లు మాట్లాడుతున్నారు. కానీ కొవిడ్ సంక్షోభ కాలంలో క్యాథలిక్ చర్చి, అన్నిక్రైస్తవ సంస్థలు ఎదుర్కొన్న భయం గురించి మాట్లాడటం లేదు. ఆ సమయంలో చర్చి కార్యక్రమాలను నిర్వహించినందుకు క్రైస్తవ మత ప్రబోధకులు, మత ప్రచారకులను అరెస్టు చేశారు'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. దీంతోపాటు ఒక ఏఐ చిత్రాన్ని కూడా ట్రంప్ పోస్ట్ చేశారు. అందులో క్రీస్తును పోలిన రూపంలో ట్రంప్ ఓ రోగిని స్వస్థతపరుస్తున్నట్లు కనిపిస్తున్నారు. దీనిపై విమర్శలు రావడంతో, తన చిత్రాన్ని వైద్యుడి రూపంలో పెట్టానని, క్రీస్తు రూపంలో కాదని ట్రంప్ వివరణ ఇచ్చారు. ఆ తర్వాత ఆ చిత్రాన్ని తొలగించారు.




## రెడ్‌మీ నుంచి ఎంట్రీ లెవల్ 5జీ స్మార్ట్‌ఫోన్

ఎంట్రీ లెవల్ స్మార్ట్ ఫోన్ కొనుగోలు చేయాలనుకునే వారి కోసం షావోమీ సంస్థ రెడ్‌మీ ఏ7 ప్రో 5జీ (Redmi A7 Pro) మొబైల్‌ను లాంచ్ చేసింది. ఇప్పటికే గ్లోబల్ మార్కెట్‌లో ఎంట్రీ ఇచ్చిన ఈ ఫోన్.. భారత్‌లో సోమవారం విడుదలైంది. 6,300 ఎంఏహెచ్ బ్యాటరీ, 32 ఎంపీ డ్యూయల్ కెమెరాతో ఈ ఫోన్ వస్తోంది. ఫీచర్లు, ధర వివరాలు ఇప్పుడు చూద్దాం..

రెడ్‌మీ ఏ7 ప్రో ఫీచర్లు ఇవే..
6.9 అంగుళాల హెచ్‌డీ+ ఎల్‌సీడీ స్క్రీన్
ఆండ్రాయిడ్ 16తో కూడిన హైపర్‌ఓఎస్3
నాలుగేళ్ల ఓఎస్ అప్‌డేట్స్, ఆరేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్
ఆక్టాకోర్ యూనిసోక్ టీ8300 ప్రాసెసర్
జెమినై, గూగుల్ సర్కిల్ టు సెర్చ్ ఏఐ ఫీచర్లు
32 ఎంపీ ప్రధాన కెమెరా
ముందు వైపు 8 ఎంపీ కెమెరా
వైఫై 5, బ్లూటూత్ 5.4, యూఎస్‌బీ టైప్‌సి పోర్ట్, ఐపీ52 రేటింగ్
6300 ఎంఏహెచ్ బ్యాటరీ, 15W వైర్డ్ ఛార్జింగ్
రివర్స్ వైర్డ్ ఛార్జింగ్ సదుపాయం
ధర: 4జీబీ+ 64జీబీ= రూ.11,499
4జీబీ+ 128జీబీ= రూ.12,499

## ప్రపంచానికి చమురు షాక్..
## హర్మ్యూజ్‌ను దిగ్బంధిస్తే క్రూడ్ 150 డాలర్లకు?



ఇరాన్ అమెరికా మధ్య శాంతి చర్చలు విఫలమైన వేళ అంతర్జాతీయంగా చమురు ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. కాల్పుల విరమణ ఒప్పందంతో 100 డాలర్లకు దిగువకు వచ్చిన బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర మళ్లీ సెంచరీ దాటేసింది. ట్రంప్ హెచ్చరించినట్లు హర్మ్యూజ్‌ను పూర్తిగా దిగ్బంధిస్తే చమురు ధర 150 డాలర్లకు చేరే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
టెహ్రాన్‌కు అక్రమంగా టోల్ చెల్లించే ఏ నౌకనూ ఆ జలసంధిలో ప్రయాణించనివ్వొద్దని తమ నౌకాదళాన్ని ఆదేశించినట్లు ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే. మరోవైపు, సీజ్ ఫైర్‌ను ఉల్లంఘించి ఏదైనా సైనిక నౌక హర్మ్యూజ్‌కు చేరుకుంటే దాన్ని తీవ్రంగా పరిగణిస్తామని ఇరాన్ ఐఆర్‌జీసీ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర 8 శాతం పెరిగి 103 డాలర్లకు చేరింది. అయితే, దిగ్బంధనం బెదిరింపులు ఇంకా పూర్తిగా ధరల్లో ప్రతిబింబించలేదని ఓనిక్స్ క్యాపిటల్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ జార్జ్ మోంటెపెక్ అన్నారు. ట్రంప్ హెచ్చరికలు కార్యరూపం దాలిస్తే బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 140, 150 డాలర్లకు చేరువ కావడం ఖాయమని ఓ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.
హర్మ్యూజ్ గుండా కొన్ని దేశాలకు చెందిన నౌకలు యథాతథంగా ప్రయాణిస్తున్నాయి. ట్రంప్ చెప్పినట్లు ఏ నౌకనూ అనుమతించకపోతే రోజుకు 12 మిలియన్ బ్యారెళ్ల చమురు సరఫరా ప్రమాదంలో పడుతుందని మోంటెపెక్ అన్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా చమురు కొరతకు దారితీస్తుందన్నారు. అదే జరిగితే ఇప్పటి వరకు ఒక ప్రాంతానికే పరిమితమైన ఈ యుద్ధం.. ప్రపంచ వ్యాప్త పోరుకు దారితీయొచ్చని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతానికి పూర్తి స్థాయి దిగ్బంధనం జరగకపోవచ్చని మార్కెట్ అంచనా వేస్తోందన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు



నిత్యావసర వస్తువుల్లో ఒకటైన గ్యాస్ సిలిండర్ ధరలు అంతర్జాతీయ ముడి చమురు ధరలపై ఆధారపడి ఉంటాయి. ఇటీవల అంతర్జాతీయ ఉద్రిక్తతల (ఇరాన్-ఇజ్రాయెల్ వివాదం) కారణంగా చమురు మార్కెటింగ్ కంపెనీలు దేశీయ వంట గ్యాస్(LPG) సిలిండర్ ధరలు పెంచిన విషయం తెలిసిందే. ఈ పెంపుతో హైదరాబాద్‌లో 14.2 కిలోల సిలిండర్ ధర సుమారు రూ. 965కు చేరుకుంది.

ఈ నెల(ఏప్రిల్) ఒకటో తేదీన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరల్ని పెంచగా.. గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధరలు స్థిరంగా ఉన్నాయి. 19 కేజీల ఎల్పీజీ కమర్షియల్ సిలిండర్ పై రూ.195.50 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. ఇదిలా ఉంటే.. ఇవాళ(ఏప్రిల్ 13) రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడలో గ్యాస్ సిలిండర్ ధరలు ఏ విధంగా ఉన్నాయో చూద్దాం.

ఈ రోజు గ్యాస్ సిలిండర్ ధరలు
హైదరాబాద్: రూ.965
వరంగల్: రూ.984
విశాఖపట్నం: రూ.921
విజయవాడ: రూ.937.50

# నష్టాలతో ముగిసిన సూచీలు



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఇరాన్‌అమెరికా మధ్య చర్చలు విఫలం కావడం, హర్మ్యూజ్ దిగ్బంధనానికి ట్రంప్ ఆదేశాలు ఇవ్వడం వంటి కారణాలతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. దీనికితోడు చమురు ధరలు పెరగడమూ ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో పీఎస్‌యూ బ్యాంక్స్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. అయితే, సెన్సెక్స్ ఓ దశలో 1600 పాయింట్లు నష్టపోగా.. తర్వాత కాస్త కోలుకుని 700 పాయింట్ల నష్టానికే పరిమితం కావడం ఊరటనిచ్చే అంశం.
సెన్సెక్స్ ఉదయం 75,937.16 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,550.25) భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 75,868.32 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 702.57 పాయింట్ల నష్టంతో 76,847.57 వద్ద ముగిసింది. నిఫ్టీ 207.95 పాయింట్ల నష్టంతో 23,842.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 56 పైసలు బలహీనపడి 93.39గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్టీపీసీ, యాక్సిస్ బ్యాంక్ స్టాక్స్ మాత్రమే లాభపడ్డాయి. మారుతీ సుజుకీ, ఇండిగో, బజాజ్ ఫైనాన్స్, రిలయన్స్, టీసీఎస్ స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 102 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4717 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.
స్టాక్ మార్కెట్ నష్టాలకు కారణాలు ఇవే..
అమెరికాఇరాన్ మధ్య చర్చలు విఫలం కావడంతో హర్మ్యూజ్‌ను దిగ్బంధించాలని తమ నౌకాదళాన్ని ఆదేశించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఈ పరిణామాలు సెంటిమెంట్ దెబ్బతీశాయి.
ఇటీవల కాస్త తగ్గిన చమురు ధరలు మరోసారి భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు ఏడు శాతం పెరిగి 102 డాలర్లకు చేరింది.
ఇటీవల కాస్త కోలుకున్నట్లు కనిపించిన రూపాయి మరోసారి పతనం కావడం, ఆసియా పసిఫిక్ మార్కెట్లు నష్టాల ప్రభావం మన సూచీలపై పడింది.
ఎఫ్‌ఐఐల విక్రయాలు కొనసాగుతుండడమూ మన మార్కెట్ల ప్రతికూల ప్రభావం చూపింది.

## TCS నాసిక్ క్యాంపస్‌లో లైంగిక వేధింపులు.. ఏడుగురు ఉద్యోగులపై వేటు

టీసీఎస్ నాసిక్ క్యాంపస్ వ్యవహారం సంచలనంగా మారింది. లైంగిక వేధింపులు, మత మార్పిడులకు పాల్పడ్డారన్న ఆరోపణలపై కొంతమంది ఉద్యోగులను పోలీసులు అరెస్ట్ చేశారు. హెచ్‌ఆర్ మేనేజర్ సహా ఏడుగురు ఉద్యోగులను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై టీసీఎస్ స్పందించింది. అరెస్టయిన ఉద్యోగులను సస్పెండ్ చేశామని తెలిపింది. పని ప్రదేశంలో ఇలాంటి వేధింపులను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని స్పష్టం చేసింది. పోలీసు విచారణకు పూర్తి స్థాయిలో సహకరిస్తున్నామని తెలిపింది.
ఏం జరిగిందంటే?
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాసిక్ క్యాంపస్‌లో పని చేస్తున్న ఓ మహిళా ఉద్యోగి తన సహోద్యోగిపై ఫిర్యాదు చేశారు. పెళ్లి పేరుతో తనను మోసగించినట్లు అందులో పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు చేసే క్రమంలో మరో ఏడుగురు మహిళలు ముందుకొచ్చి.. తమపై జరిగిన వేధింపుల గురించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ సహా అసిఫ్ అన్సారీ, షఫీ షేక్, షారుఖ్ ఖురేషి, రజా మేమన్, తౌసిఫ్ అత్తర్, డానిష్ షేక్ పేర్లు కూడా వెలుగులోకి వచ్చాయి. 2022 ఫిబ్రవరి నుంచి 2026 మధ్య పని ప్రదేశంలో వీరు లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సదరు మహిళా ఉద్యోగులు పేర్కొన్నారు. అనుచితంగా తాకడం, అసభ్యకరమైన కామెంట్స్ చేయడం, బాడీ షేమింగ్, నాన్ వెజ్ తినాలని ఒత్తిడి చేయడం వంటివి చేశారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై హెచ్‌ఆర్ విభాగానికి మహిళా ఉద్యోగులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం గమనార్హం.
పోలీసుల కోవర్ట్ ఆపరేషన్
మహిళా ఉద్యోగుల ఫిర్యాదులపై పోలీసులు అండర్ కవర్ ఆపరేషన్ చేపట్టారు. ఏడుగురు మహిళా పోలీసులు మారు వేషంలో టీసీఎస్ క్యాంపస్‌లోకి ప్రవేశించారు. ఈ క్రమంలో ఓ మహిళా ఉద్యోగి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఓ వ్యక్తిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మిగిలిన వారిపై వచ్చిన అభియోగాలపై 40కి పైగా సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. మరోవైపు నాసిక్ క్యాంపస్ వ్యవహారంపై కేంద్రానికి ఐటీ ఉద్యోగుల సంఘం నైట్స్ లేఖ రాసింది. టీసీఎస్ సహా అన్ని సంస్థల్లో పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నిబంధనలు పాటించడంపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను కోరింది.
నాసిక్ క్యాంపస్‌లో లైంగిక వేధింపుల వ్యవహారం తీవ్ర ఆందోళనకరమని టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ అన్నారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఆ ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ వ్యవహారంపై ఓ సీనియర్ ఎగ్జిక్యూటివ్ నేతృత్వంలో విచారణకు ఆదేశించినట్లు చెప్పారు. వాస్తవాలను నిర్ధరించడానికి, దీనికి బాధ్యులైన వ్యక్తులను గుర్తించడానికి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఆరతి సుబ్రమణియన్ నేతృత్వంలో సమగ్ర విచారణ జరుగుతోందని తెలిపారు.




## ఆ మొత్తం ఇప్పుడే కట్టమంటే కుప్పకూలుతాం: స్పైస్‌జెట్




దిల్లీ: ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విమానయాన సంస్థ స్పైస్‌జెట్ నగదు చెల్లింపులకు సంబంధించి దిల్లీ హైకోర్టుకు విజ్ఞప్తి చేసింది. కళానిధి మారన్, ఆయనకు చెందిన కేఏఎల్ ఎయిర్‌వేస్‌తో ఉన్న పాత వివాదానికి సంబంధించి సంస్థ చెల్లించాల్సిన రూ.144.5 కోట్లు ఇప్పుడే చెల్లించాలని ఒత్తిడి తెస్తే తాము కుప్పకూలుతామని పేర్కొంది. ఈ నగదు డిపాజిట్‌కు సంబంధించి కోర్టు ఇచ్చిన గడువు ఏప్రిల్ 14తో ముగియనున్న వేళ స్పైస్‌జెట్ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. స్పైస్‌జెట్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ''పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం వల్ల విమాన సర్వీసులకు ఆటంకం కలగడం, విమాన ఇంధన (ATF) ధరలు పెరగడం వల్ల నగదు కొరత ఏర్పడింది. ఒకవేళ ఇప్పుడే ఈ భారీ మొత్తాన్ని నగదు రూపంలో చెల్లించాల్సి వస్తే ఆర్థికంగా దెబ్బతిని 'కుప్పకూలిపోయే' (Collapse) అవకాశం ఉంది. నగదుకు బదులు గురుగ్రామ్‌లో ఉన్న తమ కంపెనీకి చెందిన ఎకరం వాణిజ్య భూమిని సెక్యూరిటీగా పెట్టుకోవాలి. ఒకవేళ ఆ ఆస్తిని అత్యవసరంగా అమ్మాల్సి వస్తే 50 శాతం తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తుంది. అలా నష్టానికి ఆస్తులను అమ్ముకునేలా బలవంతం చేయొద్దు'' అని స్పైస్‌జెట్ కోర్టును కోరింది. వాదనలు విన్న దిల్లీ హైకోర్టు ధర్మాసనం తదుపరి విచారణను ఏప్రిల్ 15కు వాయిదా వేసింది.
నేపథ్యం ఇదీ..
2015లో స్పైస్‌జెట్ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సమయంలో కళానిధి మారన్ తన 58.46 శాతం షేర్లను స్పైస్‌జెట్ వ్యవస్థాపకుడు అజయ్‌సింగ్ పేరుపై మార్చారు. అప్పుడు తాను పెట్టుబడి పెట్టిన రూ.679 కోట్లకు బదులు ఆ సంస్థ కన్వెర్టిబుల్ వారెంట్స్, ప్రిఫరెన్స్ షేర్లను ఇచ్చేలా అజయ్‌సింగ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ షేర్లను ఇవ్వలేదని కళానిధి మారన్ ఆరోపించారు. దీంతో 2018లో మధ్యవర్తిత్వ ట్రిబ్యునల్ రూ.579 కోట్లను వడ్డీతో సహా మారన్‌కు తిరిగి చెల్లించాలని ఆదేశించింది. ఈ వివాదంలో భాగంగా సుమారు రూ.144.51 కోట్లను కోర్టులో డిపాజిట్ చేయాలని దిల్లీ హైకోర్టు గతంలో స్పైస్‌జెట్‌కు ఆదేశాలిచ్చింది. దీనిపై సుప్రీం కోర్టును ఆశ్రయించినా చుక్కెదురవ్వడంతో దిల్లీ హైకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది.

## ఓలా నుంచి కొత్త స్కూటర్.. సింగిల్ ఛార్జింగ్‌తో 320 km

ప్రముఖ విద్యుత్ వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ (Ola Electric) కొత్త స్కూటర్‌ను మార్కెట్‌లోకి లాంచ్ చేసింది. సొంతంగా అభివృద్ధి చేసిన 4680 భారత్ సెల్‌తో తయారు చేసిన ఎస్1 ఎక్స్+ 5.2 kWh వేరియంట్‌ను (Ola S1 X+) సోమవారం విడుదల చేసింది. దీని ధరను రూ.1,29,999గా నిర్ణయించింది. ఇన్‌హౌస్‌లో రూపుదిద్దుకున్న సెల్ టెక్నాలజీ సాయంతో తయారు చేసిన స్కూటర్ కావడంతో అందుబాటు ధరలో తేవడం సాధ్యమైందని ఓలా ఎలక్ట్రిక్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఏప్రిల్ 15 వరకు ప్రారంభ ధర కింద రూ.1.29 లక్షలకు విక్రయించనున్నట్లు ఓలా తెలిపింది. ఇందులో 11kW మిడ్ డ్రైవ్ మోటార్‌ను అమర్చినట్లు వెల్లడించింది. సింగిల్ ఛార్జింగ్‌తో 320 కిలోమీటర్లు (IDC రేంజ్) ప్రయాణించొచ్చని పేర్కొంది. ఈ స్కూటర్ టాప్ స్పీడ్ గంటకు 125 కిలోమీటర్లు. బ్రేకింగ్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుస్తూ బ్రేక్ బై వైర్, ఫ్రంట్ డిస్క్ బ్రేక్ సదుపాయంతో తీసుకొచ్చినట్లు ఓలా వెల్లడించింది.
ఓలా ఎలక్ట్రిక్ ఎస్1 ప్రో స్కూటర్లతో పాటు రోడ్‌స్టర్ విద్యుత్ మోటార్ సైకిళ్లను విక్రయిస్తోంది. ఎస్1 థర్డ్ జనరేషన్‌లో ఎస్1 ప్రో+ (5.2kWh, 4kWh), ఎస్ 1ప్రో (4 kWh, 3kWh) పేరుతో ప్రీమియం స్కూటర్లను విక్రయిస్తోంది. మాస్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని ఎస్1 ఎక్స్+ (4kWh), ఎస్ 1 ఎక్స్ (2, 3, 4 kWh) విక్రయిస్తోంది. రోడ్‌స్టర్ ఎక్స్+ను 4.5kWh, 9.1 kWh కాన్ఫిగరేషన్‌తోనూ, రోడ్‌స్టర్ ఎక్స్‌ను 2.5, 3.5, 4.5 kWh బ్యాటరీ సామర్థ్యంతోనూ విక్రయిస్తోంది. ఎస్1 ఎక్స్+ 5.2 kWh ఈ శ్రేణిలో కొత్తగా చేరింది.



## కొత్త లుక్‌లో రామ్ చరణ్... 'ఎస్క్వైర్' కవర్‌పై పవర్‌ఫుల్‌గా గ్లోబల్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ మరోసారి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ప్రఖ్యాత 'ఎస్క్వైర్ ఇండియా' మ్యాగజైన్ లేటెస్ట్ ఎడిషన్ కవర్ పేజీపై ఆయన మెరిశారు. ఈ సందర్భంగా మ్యాగజైన్, రామ్ చరణ్‌ను "ప్రస్తుత తరాన్ని ప్రభావితం చేస్తున్న గ్లోబల్ ఫోర్స్" అని, "భారతీయ సినిమాకు ఒక ముఖ్యమైన ముఖచిత్రంగా నిలిచారు" అని అభివర్ణించింది.

"రామ్ చరణ్ సినీ ప్రయాణాన్ని సెలబ్రేట్ చేస్తూ, ఆయన్ను మునుపెన్నడూ చూడని సరికొత్త రూపంలో మా కవర్‌పై ఆవిష్కరిస్తున్నాం" అని ఎస్క్వైర్ ఇండియా తన కథనంలో పేర్కొంది. ఈ ఫోటోషూట్‌ను ప్రత్యేకంగా హాంకాంగ్‌లో నిర్వహించినట్లు సమాచారం. ప్రస్తుతం రామ్ చరణ్, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ నుంచి స్వల్ప విరామం తీసుకుని ఆయన హాంకాంగ్‌లో జరిగిన ఈ ఫోటోషూట్‌లో పాల్గొన్నారు. విశేషమేమిటంటే, 'పెద్ది' సినిమా కోసం మెయింటైన్ చేస్తున్న హెయిర్‌స్టైల్‌తోనే ఆయన ఈ షూట్‌లో కనిపించారు. దీంతో ఆయన లుక్‌పై అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



## 'భరతవర్ష : సాగా ఆఫ్ శూల'... గోపీచంద్ కొత్త చిత్రానికి పవర్ ఫుల్ టైటిల్

మాస్ హీరో గోపీచంద్ తన 33వ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమాకు 'భరతవర్ష : సాగా ఆఫ్ శూల' అనే శక్తివంతమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ, సోమవారం టైటిల్ గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. ఇందులో గోపీచంద్ మునుపెన్నడూ కనిపించని రీతిలో వారియర్ అవతారంలో ఆకట్టుకున్నారు. భీకర యుద్ధ సన్నివేశాలతో ఈ గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచింది.

ఈ చిత్రం 7వ శతాబ్దం నాటి అవిభక్త భారతదేశంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతోంది. చారిత్రక అంశాలకు పౌరాణిక నేపథ్యాన్ని జోడించి దర్శకుడు సంకల్ప్ రెడ్డి దీన్ని రూపొందిస్తున్నారు. గ్లింప్స్‌లో కనిపించిన గ్రాండ్ విజువల్స్, ఉత్కంఠభరితమైన నేపథ్య సంగీతం సినిమా స్థాయిని తెలియజేస్తున్నాయి. గోపీచంద్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస్ చిట్టూరి నిర్మిస్తున్నారు. అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తున్నారు.

ఈ సినిమాలో గోపీచంద్‌కు జోడీగా రీతూ వర్మ నటిస్తోంది. గత కొంతకాలంగా సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న గోపీచంద్‌కు ఈ భారీ హిస్టారికల్ యాక్షన్ చిత్రం కమ్‌బ్యాక్ ఇస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. విడుదల తేదీని త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది.

# త్రిష ఇంటికి బాంబు బెదిరింపు

చెన్నైలో ప్రముఖ నటి త్రిష కృష్ణన్ నివాసానికి బాంబు బెదిరింపు రావడం కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు ఈమెయిల్ ద్వారా పంపిన ఈ హెచ్చరికతో పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు.

పూర్తి వివరాల్లోకి వెళితే... చెన్నైలోని తేనాంపేట్ ప్రాంతంలో ఉన్న త్రిష నివాసంలో బాంబు పెట్టినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ ప్రాంతాన్ని తక్షణమే తమ ఆధీనంలోకి తీసుకుని, భద్రతను కట్టుదిట్టం చేశారు. బాంబ్ స్క్వాడ్ నిపుణులు రంగంలోకి దిగి ఇంటి లోపల, పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అయితే, ఎక్కడా ఎలాంటి పేలుడు పదార్థాలు లభించకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ బెదిరింపు కేవలం ఒక తప్పుడు సమాచారం అని పోలీసులు ధృవీకరించారు.

ఈ తప్పుడు బెదిరింపు ఈమెయిల్ ఎక్కడి నుండి వచ్చింది? ఎవరు పంపారు? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ విభాగం సాంకేతిక ఆధారాలను సేకరిస్తోంది. ప్రజల్లో భయాందోళనలు కలిగించే ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రముఖుల నివాసాలను లక్ష్యంగా చేసుకుని వస్తున్న ఇలాంటి బెదిరింపుల నేపథ్యంలో, చెన్నై పోలీసులు నగరంలోని సెలబ్రిటీల ఇళ్ల వద్ద నిఘాను పెంచారు. ఈ ఘటనతో త్రిష అభిమానులు కాస్త ఆందోళనకు గురైనప్పటికీ, అది వదంతి అని తేలడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



## సింగిల్‌గా ఉండటమే ఇష్టం..
### తన రిలేషన్‌షిప్‌పై స్పందించిన రామ్ పోతినేని

**టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్లలో ఒకరైన రామ్ పోతినేని తన రిలేషన్‌షిప్ స్టేటస్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, సింగిల్‌గా ఉండటమే తనకు ఇష్టమని స్పష్టం చేశారు. తన ఈ సింగిల్ స్టేటస్ అనేది కావాలని తీసుకున్న నిర్ణయం కాదని, అది తన వ్యక్తిత్వంలో భాగమని తెలిపారు.**

చిన్నప్పటి నుంచి ఒంటరిగా ఉండటానికి అలవాటు పడ్డానని రామ్ తెలిపారు. ఖాళీ సమయాన్ని పూర్తిగా ఆస్వాదిస్తానని, ఆ ఏకాంతం తనకు ఎంతో ప్రశాంతతను ఇస్తుందని వివరించారు. స్నేహితులతో గడపడం ఇష్టమే అయినా, తన కోసం తాను సమయం కేటాయించుకోవడంలోనే ఎక్కువ ఆనందం ఉంటుందన్నారు. అయితే, తన జీవితంలోకి ఎవరైనా వస్తే వారితో సమయం గడపడానికి సిద్ధమేనని, ఒకవేళ ఎవరూ రాకపోయినా ఒంటరిగా మరింత సంతోషంగా ఉంటానని రామ్ పేర్కొన్నారు. సినిమా రంగంలో ఎప్పుడూ వందలాది మందితో కలిసి పనిచేయాల్సి ఉంటుందని, అంతమంది మధ్యలో కూడా తనకంటూ ఓ ప్రత్యేక ప్రపంచాన్ని సృష్టించుకున్నానని అన్నారు. ముఖ్యంగా లాక్‌డౌన్ సమయంలో దాదాపు ఏడాదిన్నర పాటు ఒంటరిగా ఉన్న విషయాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు.



## పెళ్లి తర్వాత సెట్లోకి జంటగా తొలిసారి...

'రణబాలి' చిత్రంతో జంటగా ప్రేక్షకుల్ని అలరించనున్నారు విజయ్ దేవరకొండ రష్మిక. వీళ్లిద్దరూ కలిసి నటిస్తున్న ఈ సినిమాని రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా కోసం విజయ్ రష్మిక తిరిగి సెట్‌లోకి అడుగు పెట్టారు. ఈ ఇద్దరూ వైవాహిక బంధంలోకి అడుగు పెట్టాక కలిసి సెట్‌లోకి రావడం ఇదే తొలిసారి కావడంతో చిత్ర బృందం వారికి స్వాగతం పలికి.. కేక్ కట్ చేయించింది. 1854 1978 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని ముస్తాబు చేస్తున్నారు. విజయ్ దీంట్లో టైటిల్ పాత్ర పోషిస్తుండగా.. ఆయన భార్య జయమ్మ పాత్రలో రష్మిక నటిస్తోంది. ఈ సినిమా సెప్టెంబరు 11న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి సంగీతం: అజయ్ అతుల్, ఛాయాగ్రహణం: నీరవ్ షా.



## 'డ్రాగన్' కోసం కండలు పెంచుతున్న తారక్.. మజిల్స్ ఫొటోతో ఫ్యాన్స్‌కు ట్రీట్



టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ తన తర్వాతి సినిమా కోసం పూర్తిగా సిద్ధమవుతున్నారు. దర్శకుడు ప్రశాంత్ నీల్‌తో చేయనున్న భారీ యాక్షన్ చిత్రం కోసం ఆయన కఠోరంగా కసరత్తులు చేస్తున్నారు. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న ఫొటోను పంచుకున్నారు. కెమెరాకు వీపు చూపిస్తూ, కండలు తిరిగిన తన శరీరాన్ని ప్రదర్శిస్తున్న ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఈ ఫొటోకు "కొన్నది కాదు.. కష్టపడి సంపాదించింది" (#BuiltNotBought) అని ఎన్టీఆర్ క్యాప్షన్ జోడించారు. దీంతో ప్రశాంత్ నీల్ సినిమాలో ఆయన పాత్ర ఏ స్థాయిలో ఉండబోతుందోనన్న అంచనాలు మరింత పెరిగాయి. 'డ్రాగన్' అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉన్న ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్, మలయాళ నటుడు బిజూ మీనన్ కూడా నటించనున్నారని సమాచారం. 1969 కాలంలో భారత్, చైనా, భూటాన్ సరిహద్దుల్లో జరిగే ఎమోషనల్ యాక్షన్ కథాంశంతో ఈ సినిమా ఉండబోతుందని తెలుస్తోంది. త్వరలోనే ఈ చిత్రం కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుంది.

## ఆయనకేం సంబంధం లేదు:
### 'జన నాయగన్' లీక్‌పై ఎడిటర్స్ యూనియన్

'జన నాయగన్' (Jana Nayagan) మూవీ సీన్స్ లీక్‌కు కారణం ఎడిటర్ ప్రదీప్ ఇ. రాఘవ్ అంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఎడిటర్స్ యూనియన్ ఖండించింది. ఈ ఘటనతో ఆయనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టత ఇచ్చింది. ''గ్రాఫిక్స్, సౌండ్ మిక్సింగ్‌ను మరింత మెరుగు పరిచేందుకు దర్శకుడు, నిర్మాతల అనుమతితోనే సినిమా కాపీని జనవరిలోనే ఓ స్టూడియోకి ప్రదీప్ పంపారు. ఒకవేళ ఆయన లీక్ చేయాలనుకుంటే ఎలాంటి వాటర్‌మార్క్ లేకుండానే చేసేవారు కదా'' అని పేర్కొంది. మరోవైపు, ఈ కేసుపై దర్యాప్తు వేగవంతంగా జరుగుతోంది. సైబర్ క్రైమ్ విభాగం ఇప్పటికే ఆరుగురిని అరెస్టు చేసింది. నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ నటించిన ఈ సినిమా లీక్ కావడంపై పలు వార్తలొస్తున్నాయి. ఇందులో రాజకీయం ప్రమేయం ఉందనేది కొందరి వాదన. తమ కుటుంబ సభ్యుల్లో ఒకరు లీక్ చేయించారన్న ప్రచారాన్ని ఉద్దేశిస్తూ విలేకరులు ఇటీవల ప్రశ్నించగా తమిళనాడు సీఎం ఎం.కె. స్టాలిన్ స్పందించారు. ఇలాంటి వార్తలు తాను చదవలేదన్నారు. ఈ ఏడాది జనవరిలోనే విడుదల కావాల్సిన సినిమా సెన్సార్ సర్టిఫికెట్ జాప్యంతో వాయిదా పడుతూ వస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కొన్ని సన్నివేశాలు ఇటీవల లీక్ కావడంతో చిత్ర బృందం సహా సినీ పరిశ్రమ ఆందోళన వ్యక్తం చేసింది.






## ఐసీసీ మహిళల టీ20 వరల్డ్ కప్.. రికార్డు స్థాయిలో ప్రైజ్‌మ

మహిళల టీ20 ప్రపంచ కప్ 2026 కోసం అంతర్జాతీయ క్రికెట్ మండలి (ICC) రికార్డు స్థాయి ప్రైజ్ మనీని ప్రకటించింది. 2024 ఎడిషన్‌లో 7,958,077 డాలర్లు నగదు బహుమతి (రూ.70 కోట్లకు పైగా) ఉండగా.. ఈ సారి ఆ మొత్తాన్ని దాదాపు 10 శాతం పెంచింది. 2026 టీ20 వరల్డ్ కప్ కోసం మొత్తం ప్రైజ్ పూల్‌ను 8,764,615 డాలర్లు (సుమారు రూ.81 కోట్లు)గా నిర్ణయించినట్లు ఐసీసీ వెల్లడించింది. విజేతగా నిలిచిన జట్టు రూ.21.8 కోట్లు, రన్నరప్ రూ.10 కోట్లు గెలుచుకోనున్నాయి. సెమీస్‌లో ఓడిన జట్లకు రూ.6 కోట్ల చొప్పున ఇవ్వనున్నారు. గ్రూప్ దశలో గెలిచిన ప్రతి జట్టుకు రూ.29 లక్షలు పొందనున్నాయి. అలాగే టోర్నీలో పాల్గొనే ప్రతి టీమ్‌కు కనీస హామీ చెల్లింపుగా రూ.2.3 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. జూన్ 12 నుంచి మొదలు కానున్న ఈ టోర్నీలో 12 జట్లు పోటీపడనున్నాయి.

## రాబోయే మ్యాచుల్లో ఏం చేస్తామంటే..: హార్దిక్ పాండ్య



ఐపీఎల్ (IPL) 2026లో భాగంగా ఆదివారం వాంఖడే స్టేడియం వేదికగా ఆర్సీబీతో (RCB) జరిగిన మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ (MI) 18 పరుగుల తేడాతో ఓటమి పాలైన విషయం తెలిసిందే. దీనిపై ముంబయి కెప్టెన్ హార్దిక్ పాండ్య (Hardik Pandya) మాట్లాడాడు. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో తమ జట్టు పుంజుకోవాల్సిన అవసరం ఉందన్నాడు. అలాగే జట్టు కూర్పు గురించి ప్రస్తావించాడు.

''మేం త్వరత్వరగా వికెట్లు కోల్పోయాం. అలాగే బౌలింగ్‌లో ఎక్కువ పరుగులు సమర్పించుకున్నాం. ఈ విషయాల్లో మేం మెరుగవ్వాల్సి ఉంది. గత రెండు, మూడు మ్యాచుల్లోనూ మేం బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఆశించిన మేరకు రాణించలేకపోయాం'' అని హార్దిక్ పాండ్య వివరించాడు.

రాబోయే మ్యాచుల్లో తమ జట్టులో మార్పులు ఉండే అవకాశముందని హింట్ ఇచ్చాడు. ''ప్రస్తుతం మేం చాలా ఎంపికలను విశ్లేషించాల్సి ఉంది. తర్వాత జరగబోయే మ్యాచుల్లో తప్పకుండా జట్టు కూర్పులో మార్పులు చేసే అంశాన్ని పరిశీలిస్తాం. అలాగే పవర్‌ప్లేలో మరిన్ని ఎక్కువ పరుగులు సాధించాలి. నిన్నటి మ్యాచ్‌లో రూథర్‌ఫోర్డ్ పోరాటం జట్టుకు ఎంతో ఉపయోగపడింది. అతడు టీమ్‌కు అదనపు బలం'' అని పాండ్య తెలిపాడు.

ఆర్సీబీతో మ్యాచ్‌లో రూథర్‌ఫోర్డ్ (71*; 31 బంతుల్లో 1 ఫోర్, 9 సిక్స్‌లు) అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. ముఖ్యంగా సిక్స్‌లతో చెలరేగిపోయాడు. అతడు పోరాడినా ముంబయి ఇండియన్స్‌కు విజయం దక్కలేదు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ 240 పరుగులు చేసింది. ఛేదనలో ముంబయి జట్టు 222 రన్స్‌కే పరిమితమైంది.

## ఆశిష్ నెహ్రాకు కోపమొచ్చింది



ఐపీఎల్ (IPL) 2026లో భాగంగా ఆదివారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (Lucknow Supergiants), గుజరాత్ టైటాన్స్ (Gujarat Titans) మధ్య మ్యాచ్ జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గుజరాత్ టైటాన్స్ కోచ్ ఆశిష్ నెహ్రాకు కోపమొచ్చింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ మ్యాచ్‌లో తొలుత లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బ్యాటింగ్‌కు దిగింది. ఒకానొక సమయంలో 157 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి కష్టాల్లో కూరుకుపోయింది.

మ్యాచ్‌లో తమదే పైచేయిగా ఉన్నప్పటికీ.. గుజరాత్ టైటాన్స్ కోచ్ ఆశిష్ నెహ్రా ఎందుకో అసంతృప్తితో కనిపించాడు. ఆడే విధానంలో ఏవో మార్పులు, చేర్పులు చేయాలని కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (Shubman Gill)కి సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ కుల్వంత్ ఖేజ్రోలియా ద్వారా సందేశం పంపాడు. ఒకానొక దశలో ఆగ్రహానికి లోనవుతూ అతడిని నెట్టినంత పనిచేశాడు. గిల్ దగ్గరకు కుల్వంత్ వెళ్లి ఏదో మాట్లాడి వచ్చాడు. ఇదంతా జరిగిన తర్వాత నెహ్రా వ్యూహం ఫలించినట్లయింది. ఆ తర్వాతి బంతికే లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బ్యాటర్ జార్జి లిండే ఔటయ్యాడు.ఈ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే నెహ్రా వ్యవహరించిన తీరును కొందరు క్రికెట్ అభిమానులు సోషల్ మీడియా వేదికగా తప్పు పడుతున్నారు. కోచ్‌గా ఉండి కోపంతో ఊగిపోతూ అలా ప్రవర్తించడం సరికాదంటున్నారు.

# కొత్త కుర్రాళ్లు కేక పుట్టించారు



.1/0.. 2/1.. 3/1.. 4/2.. 5/9.. రాజస్థాన్ రాయల్స్ పతనం సాగిన తీరిది. ఈ గణాంకాల్ని బట్టి చెప్పేయొచ్చు.. ఆ జట్టు ఎంతగా ఉక్కిరిబిక్కిరి అయిందో! ఈ ఐపీఎల్‌లో వరుసగా నాలుగు విజయాలతో జైత్రయాత్ర.. పాయింట్ల పట్టికలో అగ్రస్థానం.. దుర్భేద్యమైన బ్యాటింగ్‌తో ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచిన రాజస్థాన్‌ను కొత్త కుర్రాళ్లు నేలకు దించేశారు. పేలవ బౌలింగ్‌తో సతమతమవుతున్న సన్‌రైజర్స్‌కు గొప్ప ఉపశమనాన్ని ఇస్తూ విదర్భ ఎక్స్‌ప్రెస్ ప్రఫుల్ హింగే (4/34).. మరో అరంగేట్ర పేసర్ సకిబ్ హుస్సేన్ (4/24) సంచలన బౌలింగ్ ప్రదర్శనతో చెలరేగారు. ఐపీఎల్ అరంగేట్రంలో తొలి ఓవర్లోనే మూడు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా ప్రఫుల్ చరిత్ర సృష్టిస్తే.. సకిబ్ సైతం అదరగొట్టాడు.

హైదరాబాద్: సొంతగడ్డపై సన్‌రైజర్స్ మురిసింది. వరుసగా రెండు ఓటములు.. మొత్తంగా నాల్గింట్లో మూడు పరాజయాలతో కుదేలైన సన్‌రైజర్స్.. ఉప్పల్‌లో సోమవారం అద్భుత విజయం నమోదు చేసింది. ప్రఫుల్ హింగే, సకిబ్ హుస్సేన్ చిరస్మరణీయ బౌలింగ్‌తో సన్‌రైజర్స్ 57 పరుగుల తేడాతో రాజస్థాన్‌ను చిత్తుచేసింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ (91; 44 బంతుల్లో 8×4, 6×6), హెన్రిచ్ క్లాసెన్ (40; 26 బంతుల్లో 1×4, 3×6) బాధ్యతాయుత ఇన్నింగ్స్‌లకు.. నితీశ్‌కుమార్‌రెడ్డి (28; 13 బంతుల్లో 4×6), సలీల్ అరోరా (24 నాటౌట్; 13 బంతుల్లో 2×4, 2×6) విధ్వంసం తోడవడంతో సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 216 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం రాయల్స్ 19 ఓవర్లలో 159 పరుగులకే కుప్పకూలింది. ప్రఫుల్ రాజస్థాన్ టాప్ లేపగా.. సకిబ్ హుస్సేన్ మిగతా బ్యాటింగ్ ఆర్డర్ పని పట్టాడు. ఈ సీజన్‌లో అయిదు మ్యాచ్‌లాడిన రాజస్థాన్‌కు ఇదే తొలి ఓటమి.

టపటపా..: లక్ష్యం 217. మరే జట్టుకైనా ఇది పెద్ద లక్ష్యమే. కానీ రాజస్థాన్ దూకుడు ముందు ఇది నిలుస్తుందా అని అనుమానం. గత మ్యాచ్‌లో బెంగళూరుపై 200 పైచిలుకు లక్ష్యాన్ని ఆ జట్టు ఎంత తేలిగ్గా ఛేదించిందో, అందులో వైభవ్ సూర్యవంశీ ఎలా చెలరేగిపోయాడో తెలిసిందే. ఉప్పల్‌లో ఈ కుర్రాడు ఎలా ఆడతాడో చూద్దామని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తుంటే.. ఎదుర్కొన్న తొలి బంతికే అతను ఔటైపోవడం పెద్ద షాక్. షార్ట్ పిచ్ బంతితో వైభవ్‌ను షాట్‌కు పురిగొల్పి వికెట్ కీపర్ క్యాచ్‌తో పెవిలియన్ చేర్చడం ద్వారా తన పేరును ఐపీఎల్ అభిమానులకు పరిచయం చేశాడు ప్రఫుల్. ఈ షాక్ నుంచి రాజస్థాన్ తేరుకునే లోపే.. ఫామ్‌లో ఉన్న ధ్రువ్ జురెల్ (0) నాలుగో బంతిని వికెట్ల మీదకి ఆడుకున్నాడు. ఆరో బంతికి ఇంకో వికెట్. సీజన్లో తొలి మ్యాచ్ ఆడిన దక్షిణాఫ్రికా బ్యాటర్ లువాన్ ప్రిటోరియస్ (0) బౌండరీ లైన్ దగ్గర నితీశ్‌కుమార్‌రెడ్డి చేతికి చిక్కాడు. ముగ్గురు బ్యాటర్లను డకౌట్ చేసి రాజస్థాన్‌ను 3/1తో పీకల్లోతు కష్టాల్లోకి నెట్టాడు ప్రఫుల్. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు మరో కొత్త బౌలర్ సకిబ్ హుస్సేన్ కూడా రాజస్థాన్‌ను వదిలిపెట్టలేదు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (1) వికెట్ పడగొట్టాడు. అద్భుత ఆరంభ ఓవర్ తర్వాత కూడా ఆకలి తగ్గని ప్రఫుల్ తన రెండో ఓవర్‌లో రియాన్ పరాగ్ (4)ను వెనక్కి పంపడంతో రాయల్స్ 9/5కు చేరుకుంది. దీంతో ఆర్సీబీ పేరిట ఉన్న ఐపీఎల్ అత్యల్ప స్కోరు (49) బద్దలవుతుందా అనిపించింది. కానీ డొనోవన్ ఫెరీరా (69; 44 బంతుల్లో 7×4, 3×6), రవీంద్ర జడేజా (45; 32 బంతుల్లో 5×4) సన్‌రైజర్స్ బౌలర్లకు ఎదురు నిలిచి జట్టుకు ఘోర ఓటమిని తప్పించారు. రెండు పరుగుల తేడాలో వీళ్లిద్దరూ ఔటైపోగా.. తుషార్ దేశ్‌పాండే (25) ఆఖర్లో మెరుపులు మెరిపించి ఓటమి అంతరాన్ని మరింత తగ్గించాడు.

తడబడుతూనే..: టాస్ ఓడినా సొంతగడ్డపై మొదట బ్యాటింగ్ చేసే అవకాశం. విధ్వంసక బ్యాటర్లు కలిగిన సన్‌రైజర్స్ నుంచి ఇక మెరుపులే అనుకున్నారంతా. కానీ అనూహ్యంగా ఇన్నింగ్స్ తొలి బంతికే అభిషేక్ ఔటయ్యాడు. మొదటి బంతికే వికెట్ల ముందుకొచ్చి భారీ షాట్ ఆడగా బౌండరీ లైన్ దగ్గర బిష్ణోయ్ చేతికి చిక్కాడు. అంతే.. సన్‌రైజర్స్ సగం బలం తగ్గిపోయినట్లు అనిపించింది. మరోవైపు హెడ్ (18; 18 బంతుల్లో 3×4) బంతిని సరిగ్గా టైమ్ చేయలేకపోవడంతో స్కోరు బోర్డు నెమ్మదిగా కదిలింది. పవర్ ప్లేలో సన్‌రైజర్స్ 51/1కే పరిమితమైంది. ఇన్నింగ్స్ గాడిన పడుతున్న క్రమంలో హెడ్ ఔటయ్యాడు. అయితే అప్పటికే క్రీజులో కుదురుకున్న ఇషాన్‌కు క్లాసెన్ (40; 26 బంతుల్లో 1×4, 3×6) తోడయ్యాక.. ఇన్నింగ్స్ స్వరూపమే మారిపోయింది. సిక్సర్లు, బౌండరీలతో అలరించిన ఇషాన్ 30 బంతుల్లోనే అర్ధసెంచరీ సాధించాడు. క్లాసెన్ కూడా జోరందుకోవడంతో సన్‌రైజర్స్ స్కోరు 10.3 ఓవర్లలో 100 దాటింది. ఆ తర్వాత వేగం మరింత పెరిగిందే కానీ తగ్గలేదు. 13 ఓవర్లకు సన్‌రైజర్స్ 140/2తో పటిష్ట స్థితికి చేరుకుంది. సాంకేతిక కారణాలతో స్టేడియంలో ఫ్లడ్‌లైట్లు ఆగిపోవడం ఏకాగ్రతను దెబ్బతీసిందో ఏమో.. అప్పటివరకు దూకుడు మీద కనిపించిన ఇషాన్, సందీప్ శర్మ వేసిన ఇన్నింగ్స్ 14వ ఓవర్లో ఔటయ్యాడు. దీంతో 88 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. కొద్దిసేపటికే క్లాసెన్ కూడా వెనుదిరిగినా.. నితీశ్‌కుమార్‌రెడ్డి (28; 13 బంతుల్లో 4×6) ఆఖర్లో మెరుపులు మెరిపించాడు. సందీప్ వేసిన 18వ ఓవర్లో అతడు మూడు సిక్సర్లు బాదాడు. ఈ ఓవర్లో మొత్తం 24 పరుగులొచ్చాయి. నితీశ్ జోరుకు ఆర్చర్ అడ్డుకట్ట వేయగా.. సలీల్ అరోరా (24 నాటౌట్; 13 బంతుల్లో 2×4, 2×6) భారీ సిక్సర్లతో జట్టు స్కోరును 200 దాటించాడు. ఇన్నింగ్స్‌ను అతడు సిక్స్‌తో ముగించాడు.

ముంచేశారు

కెరీర్లో తొలి మ్యాచ్ అంటే కాస్త ఒత్తిడి ఉండటం సహజం.. మేటి అంతర్జాతీయ ఆటగాళ్లు బరిలో ఉండే ఐపీఎల్ లాంటి టోర్నీలో మరింత ఎక్కువ ఒత్తిడినే ఆటగాళ్లు అనుభవిస్తారు. కానీ ఆ ఇద్దరు ప్రత్యర్థిని ఒత్తిడిలో ముంచెత్తి.. జట్టుకు అద్భుత విజయాన్ని అందించారు. తొలి ఓవర్లోనే ప్రఫుల్ మూడు వికెట్లతో రాజస్థాన్‌ను కష్టాల్లోకి నెడితే.. ఆ తర్వాత ఆ జట్టు కోలుకోకుండా చూసుకునే బాధ్యత సకిబ్ హుస్సేన్ తీసుకున్నాడు. వీరి దెబ్బకు 2 పరుగులకే 4 వికెట్లతో రాజస్థాన్ ఓటమి దిశగా సాగింది. ఆ తర్వాత వీరు తగ్గలేదు. తలో 4 వికెట్లతో మ్యాచ్‌ను ముగించారు. విదర్భకు చెందిన 24 ఏళ్ల ప్రఫుల్.. దేశవాళీలో సత్తా చాటి వెలుగులోకి వచ్చాడు. 10 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 27 వికెట్లు తీసిన ఈ పేసర్‌ను ఐపీఎల్ వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.30 లక్షలకు దక్కించుకుంది. మరోవైపు బిహార్‌లోని గోపాల్‌గంజ్‌కు చెందిన 21 ఏళ్ల సకిబ్ హుస్సేన్ స్థిరంగా 145 కి.మీ పైన వేగంతో బంతులు వేయగలడు. 6 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 16 వికెట్లు.. 12 టీ20ల్లో 10 వికెట్లు తీసిన ఈ పేసర్‌ను 2024 ఐపీఎల్ వేలంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.20 లక్షలతో సొంతం చేసుకుంది. కానీ అతడికి అరంగేట్రం చేసే అవకాశం దక్కలేదు. 2026 మినీ వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.30 లక్షలు వెచ్చించి సకిబ్‌ను దక్కించుకుంది.

### స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) బిష్ణోయ్ (బి) ఆర్చర్ 0; హెడ్ (సి) ఫెరీరా (బి) పరాగ్ 18; ఇషాన్ (సి) అండ్ (బి) సందీప్ 91; క్లాసెన్ (సి) పరాగ్ (బి) దేశ్‌పాండే 40; నితీశ్ (సి) జురెల్ (బి) ఆర్చర్ 28; సలీల్ 24 నాటౌట్; అనికేత్ రనౌట్ 6; హర్ష్ 0 నాటౌట్; ఎక్స్‌ట్రాలు 9; మొత్తం: (20 ఓవర్లలో 6 వికెట్లకు) 216; వికెట్ల పతనం: 10, 255, 3143, 4162, 5195, 6209; బౌలింగ్: ఆర్చర్ 40372; బర్గర్ 40310; సందీప్ 40521; తుషార్ 40551; పరాగ్ 1051; బిష్ణోయ్ 30350

రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) నితీశ్ (బి) సకిబ్ 1; వైభవ్ (స్టంప్డ్) సలీల్ (బి) ప్రఫుల్ 0; జురెల్ (బి) ప్రఫుల్ 0; ప్రిటోరియస్ (సి) నితీశ్ (బి) ప్రఫుల్ 0; పరాగ్ (సి) అభిషేక్ (బి) ప్రఫుల్ 4; జడేజా (సి) సలీల్ (బి) మలింగ 45; ఫెరీరా (బి) సకిబ్ 69; ఆర్చర్ (సి) ప్రఫుల్ (బి) సకిబ్ 2; తుషార్ (సి) ఇషాన్ (బి) మలింగ 25; బిష్ణోయ్ (సి) ఇషాన్ (బి) సకిబ్ 0; బర్గర్ నాటౌట్ 3; ఎక్స్‌ట్రాలు మొత్తం: (18 ఓవర్లలో ఆలౌట్) 159; వికెట్ల పతనం: 11, 21, 31, 42, 59, 6127, 7129, 8140, 9140; బౌలింగ్: ప్రఫుల్ 40344; సకిబ్ 40244; ఇషాన్ 40312; శివాంగ్ 30280; నితీశ్ కుమార్ రెడ్డి 20190; హర్ష్ దూబె 20220

# అరెరే.. బూమ్.. బూమ్.. బుమ్రాకు ఏమైంది?

**అతడి పేరు చెబితే బ్యాటర్లకు హడల్..**
**అతడు బంతి విసిరితే వికెట్లు ధమాల్..**
**అతడి యార్కర్ ఆడటం అతిపెద్ద సవాల్**
**అతడు బౌన్సర్ వేస్తే.. ప్రత్యర్థుల దగ్గర నో ఆన్సర్..**
**మీకు ఈ పాటికే అర్థమై ఉంటుంది..**
**ఇదంతా బూమ్ బూమ్ బుమ్రా గురించి అని..**
**కానీ ప్రస్తుత ఐపీఎల్ సీజన్లో మాత్రం..**
**అతడు ఇప్పటి వరకు వికెట్ల ఖాతా తెరవలేదు..**

టీమ్‌ఇండియా (Team India) 'పేసు'గుర్రం జస్‌ప్రీత్ బుమ్రా (Jasprit Bumrah).. ఎంతో కాలంగా ఐపీఎల్‌లో (IPL) ముంబయి ఇండియన్స్‌కు (Mumbai Indians) ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సీజన్‌లో మాత్రం ఇప్పటి వరకు అతడు ఒక్కటంటే ఒక్క వికెట్ సైతం తీసుకోలేదు. పైగా పరుగులు ధారాళంగా ఇచ్చేస్తున్నాడు. ముంబయి ఇండియన్స్ ఇప్పటి వరకు నాలుగు మ్యాచులు ఆడింది. బుమ్రా ఐపీఎల్‌లో గత అయిదు ఇన్నింగ్స్‌లుగా వికెట్ తీసుకోలేదు.

గత సీజన్‌లో అహ్మదాబాద్ వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బుమ్రా 40 పరుగులు సమర్పించుకున్నాడు. ఈ సీజన్‌లో వాంఖడే స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన పోరులో 35, అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా దిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 21, గువాహటిలో రాజస్థాన్ రాయల్స్ వేదికగా జరిగిన పోరులో (3 ఓవర్లు) 32, వాంఖడేలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో 35 పరుగులు ఇచ్చుకున్నాడు. ఇలా మొత్తంగా బుమ్రా గత అయిదు ఇన్నింగ్స్‌ల్లో 19 ఓవర్లు బౌలింగ్ వేసి.. ఒక్క వికెట్ కూడా తీయకుండా 163 పరుగులు సమర్పించుకొన్నాడు.

**బుల్లోడు సైతం బాదేశాడు..**

బుమ్రా బౌలింగ్‌లో పరుగుల సంగతి తర్వాత.. వికెట్ కాపాడుకోవడమే బ్యాటర్లకు గగనం! కానీ రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ.. బుమ్రా బౌలింగ్‌ను ఉతికి ఆరేశాడు. ఒకే ఓవర్లో ఏకంగా రెండు సిక్స్‌లు బాదాడు. దీంతో తమకు సైతం మరింత ధైర్యం వచ్చిందని జైస్వాల్ అన్నాడు.

ఆర్సీబీతో జరిగిన మ్యాచులోనూ..

తాజాగా ఆదివారం ఆర్సీబీతో జరిగిన మ్యాచులోనూ బుమ్రా తేలిపోయాడు. బెంగళూరు జట్టు ఈ మ్యాచ్‌లో నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 4 వికెట్లు కోల్పోయి 240 పరుగుల భారీ స్కోర్ చేసింది. బుమ్రా తన మార్క్ చూపించలేకపోయాడు. ప్రత్యర్థి జట్టుకు కళ్లెం వేయలేకపోయాడు. అయితే ఓవరాల్‌గా ఇతర ముంబయి బౌలర్లకన్నా.. బుమ్రానే తక్కువ పరుగులు సమర్పించుకున్నాడు.



వికెట్ల కోసం చూడకుండా..

తన అమ్ముల పొదిలోని ప్రధాన అస్త్రమైన యార్కర్లను అతడు సరిగా ఉపయోగించడం లేదని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అతడు వికెట్లు పడగొట్టాలనే ఒత్తిడిలో ఎక్కువ పరుగులు సమర్పించుకుంటున్నాడని విశ్లేషిస్తున్నారు. అతడు వికెట్ల కోసం కాకుండా.. ప్రత్యర్థి బ్యాటర్లను పరుగులు చేయకుండా బంతులు సంధించడంపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. అయితే బుమ్రా బౌలింగ్‌లో ప్రభావం చూపలేకపోవడం, వికెట్లు తీయలేకపోవడం ముంబయి విజయావకాశాలను దెబ్బతీస్తోందని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ అశ్విన్ సైతం అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్‌లో ఇంకా చాలా మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఇక నుంచైనా బుమ్రా పుంజుకోవాలని, ఎప్పటిలానే ప్రత్యర్థులను హడలెత్తించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# రాజస్థాన్ మేనేజర్.. అందుకే డగౌట్లో ఫోన్ వాడాడట!

ఐపీఎల్ (IPL) 2026లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్ సందర్భంగా రాజస్థాన్ రాయల్స్ (RR vs RCB) మేనేజర్ రోమి బిందర్ డగౌట్లో మొబైల్ ఉపయోగించడంపై వివాదం చెలరేగిన విషయం తెలిసిందే. అయితే, అతడు తన మెడికల్ ఎమర్జెన్సీ పరిస్థితి వల్లే ఫోన్ వినియోగించినట్లు తెలుస్తోంది.

బిందర్ గతంలో తీవ్ర ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడ్డాడు. అప్పుడు అతడు దాదాపు ఓ వారం రోజులపాటు వెంటిలేటర్ మీద ఉన్నాడు. ఆస్తమాతో బాధపడుతున్న అతడు గతంలో దాదాపు 10 కిలోల వరకు బరువు తగ్గాడు. అనారోగ్యం కారణంగా ఎక్కువ దూరం నడవడానికి, మెట్లు ఎక్కడానికి ఇబ్బంది పడుతుంటాడు. అయినప్పటికీ.. అతడు టీమ్‌కు తన సేవలను అందిస్తున్నాడు. ఈ క్రమంలోనే తరచూ డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లలేని పరిస్థితుల్లో అతడు డగౌట్‌లో ఫోన్ వినియోగించి ఉంటాడని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి ''అతడి ఆరోగ్య పరిస్థితిని అవినీతి నిరోధక విభాగం పరిగణనలోకి తీసుకునే అవకాశముంది. అతడు డ్రెస్సింగ్ రూమ్‌కు చేరుకోవడానికి కనీసం 50 అడుగులు నడిచి, ఆపై సుమారు 20 మెట్లు ఎక్కాల్సి ఉంటుంది. బహుశా అందుకే అతడు డగౌట్‌లో ఫోన్ చెక్ చేసుకుని ఉంటాడు'' అని సదరు వర్గాలు తెలిపాయి. నిజానికి నిబంధనల ప్రకారం టీమ్ మేనేజర్లు డగౌట్లో ఫోన్ వాడటానికి వీల్లేదు. అయితే వారు డ్రెస్సింగ్ రూంలో ఉపయోగించుకోవచ్చు. తాజాగా రోమి బిందర్ వ్యవహారం నేపథ్యంలో బీసీసీఐ అతడిపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే దానిపై క్రికెట్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

నోటీసులు జారీ.. అంటూ వార్తలు

ఇదిలా ఉండగా.. ఫోన్ వాడకంపై బీసీసీఐ అవినీతి నిరోధక శాఖ రోమి బిందర్‌కు నోటీసులు జారీ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. డగౌట్లో అతడు ఎందుకు ఫోన్ వాడాల్సి వచ్చిందో వివరణ ఇచ్చుకోవడానికి 48 గంటల సమయం ఇచ్చినట్లు తెలుస్తోంది. రోమి బిందర్ ఇచ్చే సంజాయిషీ ఆధారంగా అతడిపై బీసీసీఐ చర్యలు తీసుకుంటుందని సమాచారం.

